# ప్రజా తపన
prajathapana.com
News that matters




**సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.**

**- స్వామి వివేకానంద**


సంపుటి :01 సంచిక: 131 శుక్రవారం 07 జులై 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




## గృహ నిర్మాణంపై సిఎం జగన్ సమీక్ష

**విజయవాడ, జూలై 6 :**

గృహనిర్మాణాశాఖపై క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం ప్రగతిపై వివరాలు అందించారు. ఇప్పటి వరకు 4,24,220 ఇళ్లు పూర్తయ్యాయని, ఆగస్టు 1 నాటికి 5 లక్షల ఇళ్లు పూర్తవుతాయని వెల్లడించారు అధికారులు. రూఫ్ లెవల్, ఆ పైస్థాయిలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు 5,68,517 కాగా, వివిధ స్థాయిల్లో 9,56,369 ఇళ్లు ఉన్నాయని తెలిపారు.. ఈ అర్థిక సంవత్సరంలో హౌసింగ్ కోసం రూ.2201 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు అధికారులు. అయితే, కాలనీలు పూర్తవుతున్నకొద్దీ అన్నిరకాలుగా కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు సీఎం జగన్.. ఇళ్ల నిర్మాణవేగాన్ని ఇదే రీతిలో ముందుకు తీసుకెళ్లాలన్న ఆయన.. కోర్టు కేసులు కారణంగా ఇళ్లస్థలాలు పంపిణీ

02

## నైరుతి రుతుపవనాల ప్రభావంతో దేశ వ్యాప్తంగా జోరుగా వర్షాలు

**న్యూ ఢిల్లీ జూలై 6**

నైరుతి రుతుపవనాల ప్రభావంతో దేశ వ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ సారి రుతుపవానల రాక కాస్త ఆలస్యమైనప్పటికీ క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరించాయి. దీంతో పలు రాష్ట్రాల్లోనైతే భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే దేశ వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండగా.. రానున్న 24 గంటల్లో గోవా, మధ్య మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. వీటితోపాటు ఒడిషా, గుజరాత్, చత్తీస్‌ఘడ్, కోస్తా కర్ణాటక, కేరళలో కూడా పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఇక బీహార్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీఘడ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో సముద్ర తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.దేశ రాజధానిలో కనిష్ట ఉష్ణోగ్రతలు ఇప్పటికే 26.5 డిగ్రీ సెల్సియస్‌కు పడిపోయాయి. ఈ సీజన్‌లో ఇది సగటు ఉష్ణోగ్రతల కంటే తక్కువ. కాగా వర్షాల కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పాడ్డాయి. ఇక ముంబైలో రాత్రి నుంచి వర్షాల తీవ్రత పెరిగింది. దాదర్, మహిమ్, ఖార్, మాతుంగా, కుర్లా వంటి పలు ప్రాంతాల్లో గత 12 గంటల్లో వర్షపాతం 40 మిల్లీ మీటర్ల నుంచి 70 మిల్లీ మీటర్ల వరకు నమోదైంది.



## తగ్గనున్న వందేభారత్ టిక్కెట్ల ధరలు

**హైదరాబాద్, జూలై 6:**



వందేభారత్ రైలు ప్రయాణికులు త్వరలో తీపి కబురు వినబోతున్నారు. తక్కువ ఆక్యుపెన్సీ ఉన్న వందేభారత్ రైళ్ల రూట్లలో టికెట్ ధరలను తగ్గించేందుకు రైల్వే శాఖ యోచిస్తోంది. తద్వారా టికెట్ ధరలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చి, ఆక్యుపెన్సీని పెంచుకోవాలని భావిస్తోంది. 200 నుంచి 300 కి.మీ. పరిధిలో నడుస్తున్న తక్కువ ఆక్యుపెన్సీ ఉన్న వందేభారత్ రైళ్లలో 5-10 శాతం వరకు టికెట్ ధరలను తగ్గించే అవకాశం ఉందని సమాచారం. ఇటీవల ప్రారంభించిన నాలుగు వందేభారత్ రూట్లలో తక్కువ ఆక్యుపెన్సీ ఉంది. ఇండోర్ – భోపాల్, మడ్‌గోన్ – ముంబయి, జబల్‌పూర్ – భోపాల్ రూట్లలో మరీ తక్కువగా 21 శాతం నుంచి 55 శాతం వరకు ఆక్యుపెన్సీ ఉంది.

02

## ఏపీ తెలంగాణ హైకోర్టులకు కొత్త సీజేలు

**న్యూ ఢిల్లీ జూలై 6**



తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను కొలీజియం సిఫార్సు చేసింది. బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సజెస్ట్ చేసింది. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరధేను తెలంగాణ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సూచించింది. దీనికి రాష్ట్రపతి ఆమోద ముద్రవేయాల్సి ఉంది. వివిధ రాష్ట్రాల హైకోర్టులు, సుప్రీంకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల భర్తీపై కొలీజియం సమావేశమైంది. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం ఖాళీలపై ఫోకస్ పెట్టింది. తెలుగు రాష్ట్రాలతోపాటు ఏడు రాష్ట్రాల హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను ఎంపిక చేసి కేంద్రానికి సిఫార్సు చేసింది. ఇందులో ఏపీ, తెలంగాణ,

02

## మహాద్వారం వద్ద పడిపోయిన హుండీ



**తిరుమల, జూలై 6 :**

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం మహాద్వారం వద్ద స్వామివారి హుండీ పడిపోయింది. ఆలయం నుంచి శ్రీవారి హుండీని లారీలో పరకామణికి తరలిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో హుండీలో నుంచి కానుకలు చెల్లాచెదురుగా పడిపోయాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది కానుకలను హుండీలో వేసి.. తిరిగి హుండీని జాగ్రత్తగా లారీలోకి ఎక్కించారు. అక్కడి నుంచి పరకా మణికి తరలించారు.శ్రీవారిని

02

## గిరిజనుడి పాదాలను కడిగి క్షమాపణలు చెప్పిన సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్

**భోపాల్ జూలై 6**

మధ్య ప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో బీజేపీ నేత ప్రవేశ్ శుక్లా అవమానించిన గిరిజనుడికి ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ క్షమాపణ చెప్పారు. బాధితుని పాదాలను కడిగి, శాలువతో సత్కరించారు. నిందితుడిని బుధవారం తెల్లవారుజామున అరెస్టు చేయడంతోపాటు, అతని ఇంటిని బుల్డోజర్‌తో కూల్చివేసిన సంగతి తెలిసిందే.దశమత్ రావత్ అనే గిరిజన కూలీపై ప్రవేశ్ శుక్లా మూత్ర విసర్జన చేస్తున్నట్లు కనిపిస్తున్న ఓ వీడియో ఇటీవల బయటపడింది. దీనిపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తమైంది. ముఖ్యమంత్రి శివరాజ్ వెంటనే స్పందించి, నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితుడిని తాను భోపాల్‌లో కలుస్తానని, క్షమాపణ చెబుతానని ప్రకటించారు.



నిందితుడిని పోలీసులు బుధవారం తెల్లవారుజామున అరెస్ట్ చేశారు. ఐపీసీ సెక్షన్లు 294 (అసభ్యకర చర్యలకు పాల్పడటం), 504 (శాంతికి భంగం కలిగేవిధంగా ఉద్దేశపూర్వకంగా అవమానించడం), ఎస్సీ, ఎస్టీ చట్టం, జాతీయ భద్రత చట్టం ప్రకారం నిందితునిపై

02



## ఏబీ వెంకటేశ్వరరావుకు ఏపీ హైకోర్టులో ఊరట

**విజయవాడ, జూలై 6 :**

సస్పెన్షన్‌లో ఉన్న ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఆర్జిత లీవ్స్ పై విదేశాలకు వెళ్లేందుకు అనుమతి నిరాకరిస్తూ సి ఎస్ ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేసింది . ఈ విషయంలపై ఇవాళ ఏపీ హై కోర్టు విచారించింది. ఈ సందర్భంగా ఏబీ

02

# జగనన్న సురక్ష పథకం ను పుర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## మున్సిపల్ కమిషనర్

**గుత్తి ( ప్రజాతపన )జూలై 06**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్షా పథకం కార్యక్రమం గుత్తి మున్సిపాలిటీ పరిధిలో చిట్నేపల్లి నందు గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం లబ్ది కార్యక్రమమును సచివాలయం.1 పరిధి 1,2 వార్డుల వారికి ఏర్పాటు చేసి లబ్ది పొందిన 391 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేసి 88 మందికి ఆధార్, మొబైల్ అప్డేషన్ పరమైన సేవల లబ్ధి చేకూర్చమైనది. లబ్ది పొందిన లబ్దిదారులకు గుత్తి మునిసిపల్ చైర్ పర్సన్ దూదేకుల వన్నూర్ బీ, వైస్ చైర్ పర్సన్లు బొమ్మిరెడ్డి పద్మలత, బిందె వరలక్ష్మి, డి.టి లలిత, కౌన్సిలర్లు గద్దల రూతమ్మ, జావాడి అరవింద్ బాబు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారదులు చేతుల మీదుగా లబ్ది పొందిన ఇంటిగ్రేటెడ్ క్యాస్ట్, ఆదాయం ధ్రువపత్రాలను లబ్ది దారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు కమీషనర్ శ్రీనివాసులు ఈ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్, చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్లు పథకం గురించి వివరాలు వెల్లడిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్దిని కులమతాలకు, పార్టీలకు అతీతంగా ఎటువంటి మధ్య వర్తిత్వం, లంచగొండితనం లేకుండా నేరుగా లబ్ధిదారులకు లబ్ది చేకూర్చుటలో 90% శాతం వరకు అందజేయడమైనది, మిగిలిన 10% శాతం లబ్ధిదారుల వారి వారి ఆధార్, కుటుంబ సమాచారం మరియు సాంకేతిక లోపాల వలన ఇబ్బంది పడిన వారి కోసం ఈ జగనన్న సురక్షా పథకం కార్యక్రమంలో లబ్ది అందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేసి ఇతర నవరత్నాలు పథకాల లబ్దికి దరఖాస్తు చేసున్న వారికి ఈనెలాఖరు వరకు జరిగే వెరిఫికేషన్ లో లబ్ది చేకూర్చుటకు చర్యలు చేపట్టడమైనదని తెలిపారు. సదరు కార్యక్రమంలో మేనేజర్ మురళీధర్, డి.ఈ.ఈ ఇంతియాజ్ అలీ, సచివాలయ క్లర్క్ ఇమామ్ హుసేన్, ఆర్.ఐ లు షేక్షావలి, సి.కె రామాంజనేయులు, ఏ.ఈ లు సాయినాథ్ బాబు, రవికుమార్, బిల్ కలెక్టర్ చంద్రశేఖర్, 1వ సచివాలయ నోడల్ ఆఫీసర్ సుధాకర్, కౌన్సిల్ మీటింగ్ క్లర్క్ రాజేష్, మెప్మా టి.యం. సి కెరెన్, సి.ఓ లు సుమనదుర్గ, సురేఖ, డిపిఓ నరేష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది, మెప్మా ఆర్.పి లు, వార్డు ల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఉచిత సర్టిఫికెట్లను పొంది తమ కు ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్లను అందజేసినందుకు ప్రభుత్వం ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి అధికారులకు, సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతతో హర్షం వ్యక్తం చేశారు.

# తగ్గనున్న వందేభారత్ టిక్కెట్ల ధరలు

(మొదటిపేజీ తరువాయి)

జూన్ నెలకు సంబంధించి ఆయా రైళ్ల ఆక్యుపెన్సీని పరిశీలిస్తే.. భోపాల్- ఇండోర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కేవలం 29 శాతం, ఇండోర్- భోపాల్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళు కేవలం 21 శాతం ఆక్యుపెన్సీని మాత్రమే నమోదు చేశాయి. భోపాల్- జబల్‌పుర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రూటులో 32 శాతం ఆక్యుపెన్సీ ఉంది. జబల్‌పుర్- భోపాల్ వందే భారత్ ఆక్యుపెన్సీ రేషియో 36శాతంగా ఉంది. ఈ రూట్‌లో కూడా టికెట్ ధరలు తగ్గించే అవకాశం ఉంది. దేశంలో చాలా వందే భారత్ రైళ్లు 100శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయని, కొన్ని మాత్రమే తక్కువ ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ముఖ్యంగా తక్కువ ప్రయాణ సమయం ఉన్న రైళ్లలో టికెట్ ధరలు తగ్గిస్తే మరింత ఆదరణ సొంతం చేసుకుంటాయని అభిప్రాయపడ్డారు. ఆక్యుపెన్సీ విషయంలో కాసర్‌గోడ్-త్రివేండ్రం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అగ్రస్థానంలో ఉంది. 183 శాతం ఆక్యుపెన్సీతో అన్ని రైళ్ల కంటే ముందుంది. త్రివేండ్రం- కాసర్‌గోడ్ (176 శాతం), గాంధీనగర్- ముంబయి సెంట్రల్ (134 శాతం), ముంబయి సెంట్రల్ - గాంధీనగర్ (129 శాతం), వారణాశి - న్యూఢిల్లీ (128 శాతం), న్యూఢిల్లీ - వారణాశి (124 శాతం), డెహ్రాడూన్- అమృత్‌సర్ (105 శాతం), ముంబయి- షోలాపూర్ (111 శాతం), షోలాపూర్- ముంబయి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (104 శాతం) ఆక్యుపెన్సీ పరంగా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఒక స్టేషన్ నుంచి ఒక స్టేషన్‌కు తీసుకునే టికెట్‌ను ఒక బుకింగ్‌గా, అక్కడి నుంచి మరో స్టేషన్ వరకు టికెట్ జారీ అయితే రెండో బుకింగ్‌గా లెక్కిస్తారు.విజయవాడ నుంచి చెన్నై మధ్య శుక్రవారం నుంచి రాకపోకలు సాగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా ఐదు వందేభారత్ రైళ్లను వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. అందులో విజయవాడ నుంచి చెన్నై మధ్య నడిచే రైలు కూడా ఉంటుందని విజయవాడ డివిజన్ రైల్వే అధికారులకు సమాచారం అందింది.విజయవాడ, చెన్నై మధ్య నడిచే ట్రైన్ ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. ఈనెల 8వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో రాకపోకలు సాగుతాయని అధికారులు చెబుతున్నారు. అయితే ఇందుకు సంబంధించిన రాకపోకల, షెడ్యూల్, టిక్కెట్ ధరలు గురించి ఒకటి లేదా రెండు రోజుల్లో బయటకు రానున్నాయి. ఈ రైలును రేణిగుంట మీదుగా నడపాలని విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు కోరినట్టు తెలిసింది. ఆ ప్రకారం విజయవాడ నుంచి గూడూరు, రేణిగుంట, కాట్పాడి మీదుగా చెన్నై వెళ్లి.. అదే మార్గంలో తిరిగి రానుంది. విజయవాడ నుంచి తిరుపతి మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని, వందేభారత్ ను రేణిగుంట మీదుగా నడపాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినట?ల విజయవాడ డివిజన్ రైల్వే అధికారి తెలిపారు.

# గృహ నిర్మాణంపై సిఎం జగన్ సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

నిలిచిపోయిన చోట ప్రత్యామ్నాయ భూముల సేకరణపై దృష్టి పెట్టాలని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.విశాఖలో ఇళ్ల నిర్మాణం నిర్దేశిత సమయంలోగా పూర్తికావాలని, ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు సీఎం జగన్.. వీలైనంత త్వరగా అక్కడ పేదలకు నివాసం కల్పించడానికి ?చర్యలు వేగవంతం చేయాలన్న సీఎం. డిసెంబర్‌లోగా విశాఖలో ఇళ్లు పూర్తిచేయడానికి తగిన కార్యచరణ రూపొందించాలని, ఏం కావాలన్నా వెంటనే ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. కొత్తగా ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్నవారికి పట్టాలు ఇచ్చేందుకు భూములను సేకరించాలని ఆదేశించిన సీఎం. దీనిపై కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. వీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.ఇక, సీఆర్‌డీఏ పరిధిలో ఇళ్ల నిర్మాణం పనులు, దీనికి సంబంధించిన అంశాలను సీఎంకు తెలిపారు అధికారులు.. 45,101 మంది ఆప్షన్?3 ఎంపిక చేసుకున్నారని పేర్కొన్నారు.. ఇప్పటికే కాంట్రాక్టర్ల ఎంపిక కూడా పూర్తయిందని.. అందరితోనూ బ్యాంకు ఖాతాలు తెరిచే ప్రక్రియ ప్రారంభమైందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నీటి సరఫరా, అప్రోచ్ రోడ్లు, విద్యుత్ సరఫరా తదితర పనులపై దృష్టిపెట్టామని తెలిపారు. ఇదే సమయంలో సీఆర్‌డీఏ ప్రాంతంలో పేదలకు ఇళ్ల నిర్మాణంపై పిటిషన్లు, కోర్టు విచారణలో అంశాన్ని ప్రస్తావించారు అధికారులు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు సీఎం జగన్.. పేదలకు ఇళ్లు రానివ్వకూడదని నిరంతరం అడ్డంకులు సృష్టిస్తున్నారన్న ఆయన.. పేదవాళ్ల కడుపు కొట్టడానికి అంతమంది ఏకం అవుతున్నారని మండిపడ్డారు. పేదలకు ఇళ్లు రాకూడదన్నది వారి ఆలోచన అని దుయ్యబట్టారు. గట్టి సంకల్పంతో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి.. దీనికోసం న్యాయపరమైన చర్యలన్నీ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు సీఎం వైఎస్ జగన్.మరోవైపు టిడ్కో ఇళ్లపైనా సీఎం సమిక్ష నిర్వహించారు.. ఇప్పటివరకూ 71,452 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించింది ప్రభుత్వం. ఈనెలలో మరో 29,496 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు సిద్ధం అయ్యింది. ఆగస్టులో 49,604 ఇళ్లు ఇస్తామన్న అధికారులు. 300 చదరపు అడుగుల ప్లాట్లను ఉచితంగా ప్రభుత్వం ఇస్తున్నందున మిగిలిన కేటగిరీల్లోని (365, 430 చ.అ) లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా దాదాపు రూ.2వేల కోట్లు రుణాలుగా ఇప్పించామని తెలిపారు.. అయితే, టిడ్కో గృహ సముదాయాలను స్వయం సమృద్ధి దిశగా నడిపించాలని సీఎం ఆదేశించారు.. దీనికి సంబంధించి వివిధ ప్రతిపాదనలను పరిశీలించిన సీఎం.. వందల, వేల సంఖ్యలో గృహాలు ఈ కాలనీల్లో ఉంటున్నందున వారి అవసరాలను తీర్చేలా వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

# ఏపీ తెలంగాణ హైకోర్టులకు కొత్త సీజేలు

(మొదటిపేజీ తరువాయి)

బొంబాయి, గుజరాత్, ఒడిశా, కేరళ రాష్ట్రాలు ఉన్నాయి.ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ పీకే మిశ్రా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వెళ్లడంతో ఖాళీ ఏర్పడింది. దీనికి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను నియమించాలని కొలీజియం సూచించింది. తెలంగాణకు కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరధేను సిఫార్సు చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈయన 2018 నుంచి కర్ణాటక హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు. ఏపీ, తెలంగాణకు నియమించినట్టుగానే గుజరాత్‌కు సునీతా అగర్వాల్ అనే మహిళాన్యాయమూర్తిని ప్రధాన న్యాయమూర్తిగా సిఫార్సు చేశారు. బొంబాయి హైకోర్టుకు జస్టిస్ దేవేంద్రకుమార్, మణిపూర్‌కు జస్టిస్ సిద్ధార్థ్ మృదుల్, కేరళకు జస్టిస్ ఆశిష్ దేశాయ్, ఒడిశాకు జస్టిస్ సుబాసిస్ తలపత్రను ప్రధాన న్యాయమూర్తులుగా నియించాలని కొలీజియం సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టులో ఖాళీగా ఉన్న మూడు ప్రధాన న్యాయమూర్తుల నియామక ప్రక్రియను కూడా కొలీజియం చేపట్టింది. సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులకు బదులు ప్రస్తుతం 31 మంది ఉన్నారు. ఇప్పుడు మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనికి ఇద్దరు న్యాయమూర్తులను కొలీజియం సూచించింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఉజ్జల్ భూయాన్, కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్‌ను కొలీజియం పరిగణలోకి తీసుకుంది. జస్టిస్ ఉజ్జల్ భూయాన్ 2022 జూన్ 28 నుంచి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. జస్టిస్ ఎస్.వెంకట నారాయణ భట్ గతంలో ఉమ్మడి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పని చేశారు. 2013 ఏప్రిల్ 12 నుంచి 2019 మార్చి వరకు సేవలు అందించారు. అప్పుడే కేరళకు బదిలీ అయ్యారు. అయితే 2023 జూన్ 1 నుంచి కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు.జస్టిస్ వెంకటనారాయణ భట్ నియామకం పూర్తైతే ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్న న్యాయమూర్తుల్లో ముగ్గురు తెలుగువారు ఉన్నట్టు లెక్క. ప్రస్తుతం జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ సేవలు అందిస్తున్నారు. కొలీజియం సూచించిన పేర్లకు రాష్ట్రపతి ఆమోద ముద్రవేస్తే వీళ్లందరికీ పదోన్నతి లభిస్తుంది.

# ఏబీ వెంకటేశ్వరరావుకు ఏపీ హైకోర్టులో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

వెంకటేశ్వరరావు విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలని ఆదేశించింది. విదేశాలకు వెళ్లేందుకు అనుమతి నిరకరించిన సీ ఎస్ ఉత్తర్వులు రద్దు చేసింది. సీఎస్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టు లో పిటీషన్ దాఖలు చేశారు ఏబీ వెంకటేశ్వరరావు. దీనిపై విచారణ జరిపి నేడు తీర్పు నిచ్చింది ఏపీ ఉన్నత న్యాయస్థానం. గత ప్రభుత్వ హయాంలో నిఘా విభాగం అధిపతిగా పనిచేసిన ఏబీ వెంకటేశ్వరావు నిఘా పరికరాల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడ్డారంటూ వైసీపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆయనను విధుల నుంచి తొలగించింది. దాంతో ఆయన న్యాయపోరాటం చేశారు. ఏబీ వెంకటేశ్వరరావుపై సస్పెన్షన్ ఎత్తివేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని గతేడాది సుప్రీంకోర్టు ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ తర్వాత ఆయనకు ప్రింటింగ్ అండ్ స్టేషనరీ విభాగంలో పోస్టింగ్ ఇచ్చారు. అయితే ఆ పోస్టింగ్ ఇచ్చిన 15 రోజులకే ఆయనను మరోమారు సస్పెండ్ చేశారు. అవినీతి కేసులో సాక్షుల్ని ప్రభావితం చేశారన్న అభియోగాలతో ప్రభుత్వం ఆ మేరకు సస్పెన్షన్ వేటు వేసింది. మళ్లీ ఇంత వరకూ సస్పెన్షన్ ఎత్తివేయలేదు. దాంతో ఆయనకు పోస్టింగ్ లభించడం లేదు. ఏబీ వెంకటేశ్వరరావుపై ప్రభుత్వం నమోదు చేసిన అభియోగాలపై పూర్తిగా తేలకుండానే..ఆయనను డిస్మిస్ చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఏపీ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్రం తిరస్కరించింది. ఏబీ వెంకటేశ్వరరావును ఉద్యోగం నుంచి తొలగించడం, తప్పనిసరిగా పదవీ విరమణ చేయించడం కుదరదని స్పష్టం చేసింది. అయితే, ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవచ్చని, రిటైర్ అయ్యే వరకు లభించే ఇంక్రిమెంట్లను రద్దు చేయవచ్చని ... యూపీఎస్సీ సలహా మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సస్పెన్షన్ లో ఉన్నప్పటికీ ఈఎల్స్‌పై విదేశాలకు వెళ్లేందుకు అనుమతి తీసుకోవాలి. అందు కోసం సీఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుపై 21 రోజుల వరకు నిర్ణయాన్ని వెల్లడించలేదు.దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో అధికారుల నుంచి స్పందన లేకపోతే విదేశాలకు వెళ్లేందుకు అనుమతి లభించినట్లుగా భావించాలని చట్ట నిబంధనలు ఉన్నాయి. అయితే విచక్షణాధికారం పేరుతో సెలవులు మంజూరు అభ్యర్థనను సీఎస్ తిరస్కరించారు. అయితే సాంకేతికంగా విదేశాలకు వెళ్లేందుకు అనుమతి లభించాక... ఆర్జిత సెలవులపై విదేశాలకు వెళ్లేందుకు అనుమతి నిరాకరించడం సరికాదని హైకోర్టు పేర్కొంది. విదేశీ ప్రయాణాన్ని ప్రాథమిక హక్కుగా మేనకాగాంధీ కేసులో సుప్రీంకోర్టు గుర్తించిందని వ్యాఖ్యానించింది.

# గిరిజనుడి పాదాలను కడిగి క్షమాపణలు చెప్పిన సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలను నమోదు చేశారు. బుధవారం సాయంత్రం నిందితుని అక్రమ ఇంటిని బుల్డోజర్‌తో కూల్చేశారు. ఆ సమయంలో ఆయన తల్లి స్పృహ కోల్పోయారు. మధ్య ప్రదేశ్ హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా మాట్లాడుతూ, నిందితునిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.సీఎం చౌహాన్ బుధవారం ఇచ్చిన ట్వీట్‌లో సిద్ధి జిల్లాలో ఓ వ్యక్తి మరొక వ్యక్తిపై మూత్ర విసర్జన చేస్తున్నట్లు కనిపిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోందని, ఆ విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి, జాతీయ భద్రత చట్టం నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. బాధితుడిని, ఆయన కుటుంబ సభ్యులను తాను భోపాల్‌లో కలుస్తానని చెప్పారు.బాధితుడు దశమత్ రావత్‌ను శివరాజ్ సింగ్ చౌహాన్ గురువారం కలిశారు. రావత్‌ను కుర్చీలో కూర్చోబెట్టి, ఆయన పాదాలను శివరాజ్ కడిగారు. ఆయనకు శాలువ కప్పి సత్కరించి, క్షమాపణ చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలను ట్విటర్ వేదికగా షేర్ చేశారు. తన మనసు ఎంతో బాధతో నిండిపోయిందని, ప్రజలే తనకు దేవుళ్లని చెప్పారు.

# వరల్డ్ రిచెస్ట్ బిచ్చగాడిగా ముంబై వ్యక్తి..

**రోజూ భిక్షాటన చేస్తూ రోజుకు రూ.2,000కు పైనే సంపాదన**

**కార్పొరేట్ పాఠశాలల్లో పిల్లల చదువు .. ఓ డూప్లెక్స్ ఇంట్లో నివాసం**

**ప్రస్తుతం అతని ఆస్తి విలువు రూ.7.5 కోట్ల వరకు**

**ముంబై జూలై 6**

రోడ్డు పక్కన, సిగ్నల్స్, బస్టాండ్, రైల్వే స్టేషన్స్, ఆలయాల వద్ద భిక్షాటన చేసుకుంటూ చాలా మంది జీవనం నెట్టుకొస్తున్నారు. వారిని చూసిన కొందరు జాలితో కొంత చిల్లర దానం చేస్తుంటారు. అలా బిచ్చమెత్తుకుంటూ జీవిస్తున్న వారిలో కూడా కొందరు కోటీశ్వరులు ఉంటారని మీరు ఎప్పుడైనా ఊహించారా..? లేదు కదా. అయితే మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి మాత్రం బిచ్చమెత్తుకుంటూ కోట్లు కూడబెట్టాడు. ఇప్పుడు ఏకంగా ప్రపంచంలోనే అత్యంత సంపన్న బిచ్చగాడిగా నిలిచి వార్తల్లోకెక్కాడు. ఇంతకీ అతను ఎవరు..? అతని రోజూవారీ సంపాదన ఎంత..? ఎన్ని కోట్ల ఆస్తులు ఉన్నాయో తెలుసుకుంటే...మహారాష్ట్ర ముంబైకి చెందిన భరత్ జైన్ బిచ్చమెత్తుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబంలో ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో తన చదువును మధ్యలోనే ఆపేశాడు. ఆ తర్వాత భిక్షాటన మొదలు పెట్టాడు. అలా ముంబై వీధుల్లో రోజూ యాచిస్తూ వచ్చిన డబ్బునంతా రూపాయి రూపాయి దాచుకున్నాడు. అలా రోజుకు వేలల్లో సంపాదిస్తూ రూ.కోట్ల ఆస్తులు కూడబెట్టాడు. తన పిల్లల్ని కార్పొరేట్ పాఠశాలల్లో చదవిస్తూ.. ఓ డూప్లెక్స్ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అంతేకాదు ముంబైలో పలు చోట్ల ఆస్తులను సైతం కొనుగోలు చేశాడు. దీనికి తోడు రియల్ ఎస్టేట్ లో కూడా పెట్టుబడులు పెట్టాడు. ఈ క్రమంలో రికార్డు స్థాయిలో ఆదాయన్ని అర్జిస్తూ ఏకంగా ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన బిచ్చగాడిగా గుర్తింపు పొందాడు. ప్రస్తుతం అతని ఆస్తి విలువు రూ.7.5 కోట్ల వరకు ఉంటుందట. జైన్ కు ముంబైలో డబుల్ బెడ్ రూం ఫ్లాట్ ఉంది. దాని విలువ రూ.1.2 కోట్ల వరకు ఉంటుంది. ఇక థాణేలో రెండు షాపులు ఉన్నాయి. వీటి ద్వారా నెలకు రూ.30 నుంచి రూ.40 వేల వరకూ అద్దె రూపంలో ఆదాయం వస్తోంది. దాంతో పాటు రోజూ భిక్షాటన చేస్తూ రోజుకు రూ.2,000కు పైనే అర్జిస్తున్నాడు. అలా నెలకు రూ.60 వేల నుంచి రూ.75 వేల వరకూ సంపాదిస్తున్నాడట. మొత్తం అతని నెల ఆదాయం ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగుల జీతం కంటే ఎక్కువే మరి. ప్రస్తుతం అతను పరేల్ ప్రాంతంలో ఓ డూప్లెక్స్ ఇంట్లో భార్య, పిల్లలు, సోదరుడు, తండ్రితో కలిసి నివాసముంటున్నాడు.ఇంత సంపాదించినప్పటికీ ఇంకా అతను ఆ యాచక వృత్తిలోనే కొనసాగుతన్నాడు. కుటుంబ సభ్యులు ఆ పని మానేయమని ఎంత చెప్పినా వినట్లేదట. తనను ఇంతటివాన్ని చేసిన ఈ వృత్తిని వదిలేందుకు అతడికి ఇష్టం లేదని చెబుతున్నాడు.

# మహాద్వారం వద్ద పడిపోయిన హుండీ

(మొదటిపేజీ తరువాయి)

దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఆపద మొక్కుల వాడ మమ్ము కాచి కాపాడు అంటూ శ్రీవారికి కానుకలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకుంటుంటారు. అవి డబ్బు రూపంలో గానీ, బంగారం రూపంలో గానీ భక్తులు కానులు సమర్పిస్తారు. శ్రీవారికి హుండీ ద్వారా కోట్లలో ఆదాయం వస్తుంది. కానుకలు సమర్పించడాన్ని భక్తులు పరమ పవిత్రంగా భావిస్తుంటారు. అలాంటి హుండీ కింద పడిపోవడంపై భక్తులు ఆందోళన చెందారు. అయితే ఈ ఘటనపై స్పందించిన టీటీడీ అధికారులు .. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే హుండీ కింద పడి పోయినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# తిరుమల టెక్నాలజీతో అక్టోపస్

**తిరుమల, జూలై 6 :**

కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి కొలువు తీరిన ఆంధ్రప్రదేశ్ లోని తిరుమలకు ప్రతిరోజు కొన్ని వేల మంది శ్రీవారి భక్తులు వెలుతుంటారు. వీకెండ్, పండుగలు, వరుస సెలవుల సందర్భంలో ప్రతిరోజు లక్ష మందికి పైగా తిరుమల కొండ మీదకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఇలాంటి తిరుమలలో భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అత్యాధునిక టెక్నాలజితో తిరుమలలో పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఉన్నట్లు, ఎలాంటి భద్రతాపరమైన సమస్యనైనా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఆక్టోపస్ అదనపు ఎస్పీ నగేష్ బాబు తెలిపారు. బుధవారం పీఏసీ- 4లోని సమావేశ మందిరంలో తిరుమల అదనపు ఎస్పీ ముని రామయ్యతో కలిసి అదనపు ఎస్పీ నాగేష్ బాబు ఆక్టోపస్, పోలీస్, ఫైర్, రెవెన్యూ, వైద్య, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్టోపస్ అదనపు ఎస్పీ నగేష్ బాబు మాట్లాడుతూ తిరుమలలో తరచుగా ఇటువంటి మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా భద్రత లోపాలను అధిగమించవచ్చు అన్నారు. సంఘ విద్రోహులు తిరుమలలోని ఏదైనా ప్రదేశంపై దాడి చేసినప్పుడు ఎలా తిప్పికొట్టి భక్తులకు రక్షణ కల్పించాలి అనేది ఈ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమని ఆక్టోపస్ అదనపు ఎస్పీ నగేష్ బాబు తెలిపారు. ఈ విధంగా తిరుమలలోని ఒక విశ్రాంతి గృహంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. ఆక్టోపస్ డీఎస్పీ నరసింహారావు సంఘ విద్రోహ శక్తులను ఎదుర్కొనేటప్పుడు ఏ విభాగం అధికారులు, సిబ్బంది ఏ కార్యక్రమాలు నిర్వహించాలి అనే విషయమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బుధవారం రాత్రి 8 నుండి 11 గంటల వరకు తిరుమలలోని పద్మావతి



విశ్రాంతి గృహం వద్ద ఆక్టోపస్ పోలీసు దళం, నిఘా మరియు భద్రతా విభాగం, పోలీసు, సంబంధిత శాఖల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. తిరుమలకు వెళ్లే భక్తుల వాహనాలను, భక్తులను తిరుపతిలోని అలిపిరి దగ్గర నిలిపివేసి క్షుణ్ణంగా సోదాలు చేస్తారు. ఇక తిరుమలలోని పలు ప్రాంతాల్లో అనుమానం వస్తే భక్తులను సోదాలు చేస్తుంటారు. ఇక శ్రీవారి దర్శనానికి వెళ్లే సమయంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్ ల్లో పలు చోట్ల సోదాలు చేస్తుంటారు. ఎలక్ట్రానిక్ వస్తులు, మొబైల్ ఫోన్ లతో పాటు నిషేదిత వస్తువులను శ్రీవారి దర్శనం చేసుకునే భక్తులు తీసుకెళ్లడానికి ఎలాంటి అవకాశం లేదు.

## బ్రేక్ దర్శనం పేరుతో మోసం

విఐపి బ్రేక్ దర్శనం టిక్కెట్ల పేరుతో తిరుమలలో హైదరాబాద్‌కు చెందిన భక్తుల్ని మోసం చేసిన ఘటన వెలుగు చేసింది. బ్రేక్ దర్శనం కోసం దళారుల్ని ఆశ్రయించడంతో నకిలీ టిక్కెట్లను విక్రయించి మోసానికి పాల్పడ్డారు. తిరుమలలో దళారులకు అడ్డుకట్ట వేయడానికి టీటీడీ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అవి ఫలితాన్ని ఇవ్వడం లేదు. పెద్ద ఎత్తున దళారుల్ని అరెస్ట్ చేసినా అడపాదడపా తిరుమలకు వచ్చే భక్తులు వీరి బారిన పడుతూనే ఉన్నారు. తాజాగా వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లు ఇప్పిస్తామని ప్రత్యేక ప్రవేశ దర్శనం నకిలీ టికెట్లను భక్తులకి అంటగట్టారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులను మోసగించిన దళారుల ముఠాపై తిరుమల టూటౌన్ పోలీసులు రెండు రోజుల క్రితం కేసు నమోదయింది. ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన కామిశెట్టి వేణు శ్రీవారి దర్శనం కోసం దళారి అభిషేక్‌ను ఆశ్రయించాడు. నాలుగు వీఐపీ టికెట్లు ఇప్పిస్తానని చెప్పి వేణు వద్ద నుంచి రూ. 11వేలు తీసుకున్నాడు. మరో దళారి శ్రీను ఫోన్ నంబరు ఇచ్చి టిక్కెట్ల కోసం అతన్ని సంప్రదించాలని సూచించాడు. కామిశెట్టి వేణు ఆయన్ని సంప్రదించడంతో అతడు అశోక్ నాయక్ అనే మరో దళారి నంబరు ఇచ్చి అతన్ని కలవాలని కోరాడు. భక్తుడు అతని వద్దకు వెళ్లగా నాలుగు ప్రత్యేక ప్రవేశ దర్శనం నకిలీ టికెట్లను ఇచ్చి, ఏటీసీ కూడలి నుంచి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ మీదుగా వెళితే అక్కడ టికెట్ స్కానింగ్ చేసే శ్రీ లక్ష్మి శ్రీనివాస మ్యాన్‌పవర్‌కు చెందిన శివనారాయణ ఉంటాడని అతను అన్నీ చూసుకుంటాడని చెప్పి పంపారు. వేణు వద్ద ఉన్న నకిలీ టిక్కెట్లు తీసుకుని శివనారాయణ టికెట్లను స్కాన్ చేసినట్లు నటించి దర్శనానికి పంపించేశాడు. బ్రేక్ దర్శనం ఇప్పిస్తానని ప్రత్యేక దర్శనానికి పంపిస్తుండడంతో మోసపోయినట్లు గుర్తించిన భక్తుడు తితిదే విజిలెన్స్ వింగ్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు టికెట్లను తనిఖీ చేసి అవి ఎస్ఈడీ నకిలీ టిక్కెట్లుగా గుర్తించారు. ఈ ఘటనలో మోసానికి పాల్పడిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# పొంచి ఉన్న నీటి గండం



**నల్గొండ, జూలై 6 :**

వర్షాకాలం ప్రారంభం అయి దాదాపు 30 రోజులు కావస్తోంది. వాతావరణం మారిపోయి వర్షాలు వారానికి రెండుమూడు సార్లు కురుస్తూ ఉన్నాయి. అయినప్పటికీ రిజర్వాయర్లలోకి నీరు ఆశించినంతగా రాకపోవడం కాస్త కలవర పాటుకు గురి చేస్తోంది. ఎందుకంటే వర్షాలు ఈ నెల రోజుల్లో ఏ ప్రాజెక్టులోకి ఒక టీఎంసీకి మించి నీరు నిండలేదని సాగునీటి నిపుణులు చెబుతున్నారు. జూలైలో వర్షాలు బాగా పడ్డా, కర్ణాటక లేదా మహారాష్ట్రలో కురిసే వర్షాలపైనే తెలుగు రాష్ట్రాల్లో ప్రాజెక్టులు నిండే అవకాశాలు ఆధారపడి ఉంటాయి. ఎగువన ప్రాజెక్టులు నిండి నీటిని వదిలితే ఇక్కడ మన నీటి ప్రాజెక్టులు నిండుతాయి. ఆయా రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో పంటలు పండాలంటే జూలై, ఆగస్టు నెలలు కీలకంగా ఉన్నాయి. ఈ సమయంలో తెలంగాణలోని భారీ ప్రాజెక్టుల కింద కనీసం 175 టీఎంసీలు అవసరం అవుతాయని అంచనాగా ఉంది. కానీ, ప్రస్తుతం 105 టీఎంసీలే ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రాణహితకు ప్రవాహం రావడం, కాళేశ్వరం ఎత్తిపోతల మొదటి లిఫ్టు మేడిగడ్డ నుంచి నీటి మళ్లింపు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయని అధికారులు తెలిపారు. దీంతో గోదావరిలోని ప్రాజెక్టులకు కొంత వరకైనా ఊరట కలగనుంది. క్రిష్ణా నదీ పరివాహక ప్రాంతంలో ప్రాజెక్టులు నిండడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటికి నిర్మాణం పూర్తైన, పూర్తయ్యే దశలో ఉన్న కొంత ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్న భారీ ప్రాజెక్టుల కింద 56 లక్షల ఎకరాలు ఉన్నాయని, 42 లక్షల ఎకరాల సాగుకు ప్రస్తుత వానాకాలంలో సాగునీరు ఇవ్వాల్సి ఉందని అంచనా వేశారు. వీటిలో వరి పంట, ఆరుతడి పంటలకు కలిపి జూలై, ఆగస్టు నెలల్లో అవసరమైన నీళ్ల కంటే తక్కువగా ఉన్నాయి. అందుకే ఓ పద్ధతి ప్రకారం ముందుకెళ్లడానికి నీటిపారుదల శాఖ కసరత్తు చేస్తోంది.

# బాలయ్య మీద దీపికా పోటీ

**అనంతపురం, జూలై 6 :**

హిందూపురం వైఎస్ఆర్‌సీపీ ఇంచార్జ్ గా దీపికా రెడ్డి నియమిస్తూ సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. హిందూపురం నియోజకవర్గంలో తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత మరో పార్టీ విజయం సాధించలేదు. ఈ సారి అక్కడ విజయం సాధించాలన్న లక్ష్యంతో వైఎస్ఆర్‌సీపీ కొత్త నేతను ఎంపిక చేసుకున్నట్లుగా కనిపిస్తోంది. ఇటీవల జరిగిన ఎమ్మెల్యేలు, ఇంచార్జ్ ల సమీక్షా సమావేశానికి.. ఎమ్మెల్సీ, ఇంచార్జ్ గా ఉన్న ఇక్బాల్ కు ఆహ్వానం ఇవ్వలేదు. దీపికా రెడ్డినేపిలిచారు. తాజాగా ఆమెకు ఇంచార్జ్ పదవిని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో హై ప్రొఫైల్ నియోజకవర్గాల్లో హిందూపురం ఒకటి. టీడీపీ ఆవిర్భవించిన తర్వాత మరో పార్టీ అక్కడ గెలవలేదు . అందుకే ఎన్టీఆర్ కుటుంబసభ్యులు కూడా అక్కడి నుంచే పోటీ చేస్తూంటారు. ప్రస్తుతం బాలకృష్ణ అక్కడ నుంచి రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచారు. బాలకృష్ణను ఢీ కొట్టాలంటే ఎలాంటి ఇమేజ్ లేని నేత అవసరం అని ... ఐ ప్యాక్ డిసైడ్ చేయడంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దీపికా రెడ్డిని ఎంపిక చేశారని అంటున్నారు. పెద్దిరెడ్డిగా అత్యంత సన్నిహితుడిగా పేరు పడిన పెనుకొండ నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడి ద్వారా ఎమ్మెల్సీకి చెక్‌పెట్టి, దీపికను తెరపైకి తీసుకొచ్చారని





చెబుతున్నారు. హిందూపురం వైసీపీలో చాలా గ్రూపులున్నాయి. కాంగ్రెస్ తరపున.. తర్వాత వైసీపీ తరపున పోటీ చేసి ఓడిపోయిన నవీన్ నిశ్చల్ మరోసారి సీటు కోసం ప్రయత్నిస్తున్నారు. ఆయనకు ఆగ్రోస్ చైర్మన్ పదవి ఉంది. మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు వైసీపీలోనే ఉన్నారు. మైనార్టీ ఓటర్లు ఎక్కువగా ఉండటంతో గత ఎన్నికల్లో హిందూపురం నుంచి మాజీ పోలీసు అధికారి ఇక్బాల్ పోటీ చేశారు. ఆయన కర్నూలు జిల్లాకు చెందిన వారు. అక్కడ ఓడిపోయిన తర్వాత కూడా ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. దాంతో ఆయనే హిందూపురంలో పెత్తనం చేస్తున్నారు. అయితే ఆయనను బలంగా వ్యతిరేకించే వర్గం అక్కడ ఉంది. ఓ వర్గానికి చెందిన చౌళూరు రామకృష్ణారెడ్డి అనే నేత హత్యకు గురయ్యారు. ఈ హత్యలో ఇక్బాల్ పేరే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. అయితే చర్యలు తీసుకోలేదు కానీఆయనను పక్కన పెట్టాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. నియోజకవర్గంలో పెద్దగా ఎవరికీ తెలియని దీపికారెడ్డిని ఇంచార్జ్ గా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం అర్ధరాత్రి ప్రకటన విడుదల చేసింది. దీంతో వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో హిందూపురం టికెట్.. ఆమెకి కేటాయించడం దాదాపు ఖాయమైనట్లే. రాజకీయాల్లో అసలు ఎవరికీ తెలియని నేతను తీసుకొచ్చి.. నిలబెట్టడం అంటే సాహసం అనుకోవాలి. అదీ కూడా బాలకృష్ణ లాంటి మాస్ లీడర్ పై కొత్త నేతను దింపితే.. అందరి సహకారంతో పని చేస్తేనే పోటీ ఇవవగలుగుతారు. ఇప్పుడు టిక్కెట్ ఆశిస్తున్న నేతలంతా పని చేయడం మానేస్తారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# వెంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి

**ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త**

**వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నదానం**

**ఎల్ బి నగర్**

శ్రవణా నక్షత్రం సందర్భంగా న్యూ గడ్డిఅన్నారంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త మాట్లాడుతూ న్యూ గడ్డిఅన్నారంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రతినెలా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని అన్నారు. దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని భరోసా కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తను దేవాలయ నిర్వాహకులు శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుండ శ్యాంసుందర్, సంపత్, యాదయ్య, రాచూరి శ్రీనివాస్, రఘు, జయశంకర్ రెడ్డి, చలపతి శ్రీనివాస్ రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# చెరువు మత్తడి పేల్చివేత ఘటనలో పోలీస్ కేసు


**పెద్దపల్లి**

ఓదెల మండలంలోని శా నగొండ గ్రామంలో లో చెరువు మత్తడిని ధ్వంసం చేసిన సంఘటనలో కేసునమోదుచేసినట్టు పొత్కపల్లి ఏ ఎస్ ఐ లక్ష్మిరాజం తెలిపారు. గతనెల 27న ఓదెల మండలం శానగొండలోని ఊర చెరువు మత్తడిని కొందరు గుర్తు తెలియని దుండగులు డిటోనేటర్లతో పేల్చివేశారు. ఇందుకోసం కంప్రెషర్ బండిని వాడినట్లు అనుమానిస్తున్నారు. మత్తడిని పేల్చివేసిన సంఘటనపై ఈనెల 4న ఎస్సారెస్పి సబ్డివిసన్ ఏ ఈ వెంకటశివరాజ్, శానగొండ ఎంపీటీసీ జీల తిరుపతి, సర్పంచ్ గుంటి సునీత శ్రీనివాస్ లు పోత్కపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించి, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏ ఎస్ ఐ లక్ష్మి రాజం తెలిపారు.

# జనసేనానికి ఇన్ స్టాలో ఫుల్ ఫాలోయర్స్

**గుంటూరు, జూలై 6:**

పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్ గా ఉంటారు. రాజకీయ అంశాలను తరచూ సామాజిక మాధ్యమాల్లో ప్రస్తావిస్తుంటారు. తాజాగా ఆయన ఇన్ స్టాగ్రామ్ లో అకౌంట్ ఓపెన్ చేశారు.: జనసేన అధినేత పవన్ కల్యాణ్...సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్ గా ఉంటారు. ప్రజాసమస్యలు, వైసీపీ పాలనపై ఆయన తరచూ సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తుంటారు. ఇప్పటికే ట్విట్టర్, ఫేస్ బుక్ లో పవన్ కల్యాణ్ ఖాతాలు ఉన్నాయి. తాజాగా ఆయన ఇన్ స్టాగ్రామ్ లో ఎంట్రీ ఇచ్చారు. ఇంకా ఒక్క పోస్టు పెట్టకుండానే లక్షల మంది సబ్ స్క్రైబ్ చేసుకున్నారు. పవన్ ఇన్ స్టాగ్రామ్ లో అకౌంట్ ఓపెన్ చేశారన్న వార్తతో ఫ్యాన్స్ సందడి చేస్తున్నారు. ఇప్పటి వరకు 7 లక్షల మంది ఫాలోవర్స్ వచ్చారు. పవన్ కల్యాణ్ ట్విట్టర్ ఖాతాకు ఉన్న ప్రొఫైల్ చిత్రాన్నే ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ ప్రొఫైల్ కు పెట్టారు. పవన్ త ఇన్ స్టాగ్రామ్ ద్వారా రాజకీయ అభిప్రాయాలను పంచుకుంటారని తెలుస్తోంది. ఇన్ స్టా గ్రామ్ బయోలో 'ఏలుగెత్తు, ఎదిరించు, ఎన్నుకో .. జై హింద్!' అని రాశారు. ఇన్ స్టాలో పవన్... పొలిటికల్ అప్‌డేట్స్ మాత్రమే అధిక



ప్రాధాన్యత ఇస్తారని తెలుస్తోంది. ఏపీ రాజకీయాల్లో యాక్టివ్ అయిన పవన్... ఇటీవలె వారాహి విజయ యాత్ర తొలి విడత పూర్తి చేసుకున్నారు. వారాహి యాత్రకు ప్రజల్లో మంచి ఆదరణ రావడంతో రెండో విడత యాత్రకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటు రాజకీయం, అటు సినిమా రంగాన్ని బ్యాలెన్స్ చేస్తున్నారు పవన్. వరుసగా సినిమాలు చేస్తూనే... ప్రజా సమస్యలపై స్పందిస్తూ రాజకీయాల్లోనూ దూకుడు పెంచారు. ఏపీ ప్రభుత్వంపై విరుచుకు పడే పవన్... సామాజిక మాధ్యమాల్లోనూ వైసీపీపై విమర్శలు చేస్తుంటారు. కార్టూన్స్, కొటేషన్లతో వైసీపీ నేతలకు చురకలు అంటిస్తుంటారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ జనసేన స్పీడప్ అయింది. పవన్ కల్యాణ్ ఎప్పుడూ తన అభిమానులకు, ప్రజలకు అందుబాటులో ఉండాలని భావిస్తున్నారు. ఇప్పటికే జనసేన అధికారిక వెబ్ సైట్, ట్విట్టర్, ఫేస్ బుక్, యూట్యూబ్ ద్వారా తాను చెప్పదలుచుకున్నవి ముక్కు సూటిగా చెప్తున్నారు. తాజాగా ఇన్ స్టాలో ఎంట్రీ ఇచ్చిన పవన్.. తన అభిమానులు, కార్యకర్తలకు ఇకపై నిత్యం టచ్‌లో ఉండనున్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పవన్ దూకుడు పెంచారు. యువతను ఆకట్టుకునేందకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే సోషల్ మీడియాను యాక్టివ్ అయ్యారు పపన్. జనసేనాని పవన్ కల్యాణ్ ప్రస్తుతం ఓ వైపు బ్రో, ఓజి, ఉస్తాద్ భగత్ సింగ్, హరిహర వీరమల్లు సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు రాజకీయాలలో యాక్టివ్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గద్దెదించడమే లక్ష్యమని అంటున్నారు. 'వారాహి విజయ యాత్ర' చేసిన పవన్... మొదటి విడత సక్సెస్ కావడంతో రెండో విడత యాత్ర ప్రారంభించడానికి రెడీ అయ్యారు. వారాహి మొదటి విడత యాత్రలో భాగంగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పవన్ పర్యటించారు. వారాహి యాత్రోల రోడ్ షోలు, బహిరంగ సభలు, జనవాణి కార్యక్రమాలు, ఆత్మీయ సమావేశాలతో ప్రజా సమస్యలు తెలుసుకున్నారు పవన్.

# అమృత్ భారత్ పథకం కింద ఇచ్ఛాపురం రైల్వే పనులు

**ఇచ్ఛాపురం**

సోంపేట, జాడుపూడి, మందస రైల్వే స్టేషన్ల లను రైల్వే అధికారులతో కలిసి ఎంపి రామ్మోహన్ నాయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గంలో నున్న ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ ను డిఆర్ ఎం రింకేష్ రాయ్, కలిసి పరిశీలించామన్నారు. పలాస రైల్వే స్టేషన్ ను అభివృద్ధిచేయాలని డిఆర్ఎం కు వివరించి గట్టిగా డిమాండ్ చేశామన్నారు. అమృత భారత్ పథకం క్రింద పలాస రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేసి అందంగా తీర్చి దిద్దుతామన్నారు. పలాసలో నర్సిపురం ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ మూసి వేయడం వలన సుమారు 5000 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని డిఆర్ఎం దృష్టిలో పెట్టి పరిష్కరించమని గట్టిగా చెప్పమన్నారు. 30 రోజుల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి రీకన్ స్ట్రక్షన్ పనులు చేపడతామని డిఆర్ఎం హామీ ఇచ్చారని ఎంపి వెల్లడించారు. ఢిల్లీ వెళ్లేటప్పుడు రైల్వే సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావించి రైల్వేకు సంబంధించినంత వరకు బాధ్యత తీసుకుంటానని చెప్పారు. మందసలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం రూ. 50 లక్షలు మంజూరు చేయించామని తెలిపారు. తాళభద్ర ఎల్ సి గేటు దగ్గర గంటల కొద్దీ ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు కు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, సోంపేట, జడుపూడి, మందస రైల్వే స్టేషన్ లలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. విశాఖ పట్నం నుంచి పలాస వరకు వెళ్తున్న మెము రైలు ను ప్రజల అభ్యర్థన మేరకు ఇచ్ఛాపురం వరకు పొడిగిస్తామని ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఖుర్ద్ డివిజన్ అధికారులు అభిషేక్, గిరీష్ నాయర్, ఎంపీ రామ్మోహన్ నాయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు. శిరీష, జిల్లా నాయకులు పలాస నియోజకవర్గం టీడీపీ ముఖ్య నాయకులు టీడీపీ శ్రేణులు, యువత, మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనం డివైడర్ ను ఢీ

**అన్నమయ్య**
అన్నమయ్య జిల్లా కలికిరి పట్టణం బస్టాండ్ సమీపంలో ద్విచక్రవాహనం డివైడర్ ను ఢీ కొన్నఘటనలో ఒకరు మృతి చెందారు, మరోకరికి ఒకరికి తీవ్ర గాయాలైయాయి. సంఘటన బుధవారం సాయంత్రం కలికిరి పట్టణంలో చోటుచేసుకుంది. కలకడ వైపు నుండి టౌన్ లోకి వెళుతూ ఉండగా వెళ్తూ ఉన్న భూమా వినయ్ కుమార్ ( 20), జరుగుమల్లి వీరయ్య (45) బస్టాండ్ సమీపం వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ కు ఢీ కొనడంతో క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెనకవైపు ఉన్న భూమా వినయ్ కుమార్ తలకు తీవ్ర గాయమవడంతో మృతిచెందాడు. జరుగుమల్లి వీరయ్య కు కూడా రక్త గాయా లయ్యాయి. పరిస్థితి విషమించడంతో మెరుగైనచికిత్స కొరకు తిరుపతి రుయా కు తరలించారు.

## టోల్ ప్లాజా వద్ద కారు దగ్ధం

**రంగారెడ్డి**
రంగారెడ్డి జిల్లా శంషాబాద్ టోల్ ప్లాజా దగ్గర తప్పిన ప్రమాదం అకస్మాత్తుగా షిఫ్ట్ కార్లో మంటలు క్షణాల్లో కారు దగ్దం అయింది. అప్రమత్తమైన కారు డ్రైవర్ సురేందర్ రెడ్డి కారులో నుండి దిగి ప్రాణాలు కాపాడుకున్నాడు. శంషాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అవినీతి వీఆర్వో పై ఏసీబీ దాడులు

**నెల్లూరు**
లంచం తీసుకుంటూ ఓ అవినీతి వీఆర్వో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు . ఈ సంఘటన చేజర్ల మండలంలో తాసిల్దార్ కార్యాలయంలో బుధవారం రాత్రి జరిగింది. మండలంలోని కొల్లపనాయుడు పల్లి గ్రామానికి చెందిన వీఆర్వో రాజా ఓ ఇంటికి పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు శ్రీనివాసులు అనే వ్యక్తి వద్ద నుంచి 7 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం ఏసీబీ అధికారులు తాసిల్దార్ కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఏసీబీ డీఎస్పీ జిఆర్ఆర్ మోహన్ ఆధ్వర్యంలో ఈ దాడిలో పాల్గొన్న ఏసీబీ అధికారులు విచారణ జరుగుతున్నారు.

## గంజాయి తరలిస్తున్న కారు బోల్తా

**నల్గొండ**

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం, వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై గంజాయి తరలిస్తున్న కార్ అదుపు తప్పి బోల్తా పడింది. గంజాయి వ్యవహారం స్థానికులు గమనించారు. కారు ప్రమాదం తర్వాత వారు ఒకరిని పట్టుకున్నారు. మరో ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మృతదేహానికి రీ పోస్టుమార్టం

**జనగాం**

జనగామ జిల్లాలో ఖననం చేసిన మృతదేహానికి అధికారులు రీ పోస్టుమార్టం నిర్వహించారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం సదాశివపేట గ్రామంలో గత ఏడాది అక్టోబర్ 20 న అనుమానాస్పదంగా మృతి చెందిన సుభద్రకు కుటుంబ సభ్యులు. అంత్యక్రియలు నిర్వహించారు. తర్వాత ఆమె మృతి పై కుటుంబ సభ్యులకు అనుమానాలు వ్యక్తం కావడంతో ఖననం చేసిన 35 రోజుల తర్వాత మృతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించారు. అప్పట్లో ఎటువంటి ఆధారాలు లభించలేదని వైద్యులు నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల జరిగిన రిటైర్డ్ ఎంపీడీవో రామకృష్ణయ్య హత్య కేసు విచారణ సందర్భంగా హత్య కేసు ప్రధాన నిందితుడైన గిరబోయిన అంజయ్య సుభద్రను హత్య చేసినట్టు అంగీకరించడంతో రీ పోస్టుమార్టంకు వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. కాకతీయ వైద్య కళాశాల ప్రొఫెసర్లు నిపుణులు సమక్షంలో పోస్టుమార్టం జరిగింది.

## ఏటీఎం మోసగాడు అరెస్టు

**నంద్యాల**

ఆళ్లగడ్డ పట్టణంలో ఏటీఎం కార్డు మార్చి నగదు కాజేసిన వ్యక్తి ని పోలీసులు అరెస్టు చేసారు.ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన సుబ్బ గుర్రప్ప అనే వ్యక్తికి చెందిన 60500, రూపాయల నగదు కాజేసీన నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్టు ఆళ్లగడ్డ డిఎస్పి వెంకటరామయ్య మీడియా సమావేశంలో తెలిపారు. మహారాష్ట్ర చెందిన సంభాజీ గోవింద్ అనే వ్యక్తిని అరెస్టు చేసి మోటార్ సైకిల్, నగదు, ఏటీఎం కార్డు, సెల్ఫోన్, 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని రిమాండ్ కు పంపినట్లు డీఎస్పీ వెంకటరామయ్య తెలిపారు.

# జేడీయూలో తప్పని చీలిక..?

**పాట్నా, జులై 6 :**

బిహార్ లో అధికారంలో ఉన్న జనతా దళ్ యునైటెడ్ పార్టీ (జేడీయూ) కూడా చీలిక దిశగా వెళ్తోందా?.. పార్టీ చీఫ్, సీఎం నితీశ్ కుమార్ పై పార్టీలో వ్యతిరేకత పెరుగుతోందా?.. శివసేన, ఎన్సీపీల తరువాత బీజేపీ తదుపరి లక్ష్యం జేడీయూ యేనా?బిహార్ లో అధికారంలో ఉన్న జనతా దళ్ యునైటెడ్ పార్టీ (జేడీయూ) కూడా చీలిక దిశగా వెళ్తోందా?.. పార్టీ చీఫ్, సీఎం నితీశ్ కుమార్ పై పార్టీలో వ్యతిరేకత పెరుగుతోందా?.. శివసేన, ఎన్సీపీల తరువాత బీజేపీ తదుపరి లక్ష్యం జేడీయూ యేనా?బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాల ఐక్యతకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో.. మరోవైపు, ఆ విపక్షాల్లోని కీలక పార్టీల వెన్ను విరిచే దిశగా బీజేపీ పావులు కదుపుతోంది. ఇటీవల మహారాష్ట్రలో ఎన్సీపీ కీలక నేత అజిత పవార్.. పార్టీని చీల్చి, బీజేపీ నాయకత్వానికి జై కొట్టారు. బీజేపీ, శివసేన (షిండే వర్గం) ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి అయ్యారు. మరోవైపు, బిహార్ లో కూడా జేడీయూ చీఫ్, ముఖ్యమంత్రి నితీశ్ పై పార్టీలో వ్యతిరేకత పెరుగుతోందని, త్వరలో జేడీయూలో కూడా చీలిక తప్పదని బీజేపీ చెబుతోంది. ముఖ్యంగా తన వారసుడిగా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ను నితీశ ప్రకటించడం, జాతీయ స్థాయి విపక్ష కూటమికి రాహుల్ నాయకత్వం వహించడానికి ఆమోదం తెలపడం వంటి చర్యలు.. నితీశ్ పై పార్టీలో వ్యతిరేకత పెరగడానికి కారణమని భావిస్తున్నాయి .జేడీయూ ఎమ్మెల్యేలు, ఎంపీలు చాలా మంది తమను సంప్రదిస్తున్నారని బీజేపీ నేత, మాజీ డెప్యూటీ సీఎం సుశీల్ కుమార్ మోడీ వెల్లడించారు. పొత్తుల కారణంగా, వచ్చే ఎన్నికల్లో తమకు టికెట్ లభించే అవకాశం లేదని, ఒక వేళ టికెట్ లభించినా నితీశ్ పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కారణంగా కచ్చితంగా ఓడిపో తామని వారు భావిస్తున్నారని సుశీల్ మోదీ తెలిపారు. ఆర్జేడీతో పొత్తు వల్ల జేడీయూ నష్టపోతోందని వారు భావిస్తున్నారని వెల్లడించారు. జేడీయూకి చెందిన మెజారిటీ ఎమ్మెల్యేలు,ఎంపీల్లో నితీశ్ పై తీవ్రమైన వ్యతిరేకత ఉందని, ఎలాంటి షరతులు లేకుండా వారు బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. ఈ విషయంలో బీజేపీ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. 'జేడీయూలో తిరుగుబాటు నెలకొనే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. జేడీయూకి భవిష్యత్తు లేదనుకుంటున్నారు. నితీశ్ కుమార్ తన వారసుడిగా తేజస్వీని ప్రకటించడం పార్టీకి చేటు చేస్తుందని భావిస్తున్నారు. అందువల్ల, వారంతా బీజేపీ వైపు చూస్తున్నారు. బీజేపీలో చేరడానికి పోటీ పడుతున్నారు" అని సుశీల్ మోదీ వ్యాఖ్యానించారు.జేడీయూ ఎంపీలు, ఎమ్మెల్యేలు చాలా మంది తమను సంప్రదించారని సుశీల్ మోదీ తెలిపారు. ఎవరిని పార్టీలోకి తీసుకోవాలి? ఎవరిని తీసుకోకూడదు? అనే విషయంలో బీజేపీ ఇంకా ఏ నిర్ణయానికి రాలేదన్నారు. మొత్తానికి జేడీయూలో మాత్రం పరిస్థితి చాలా అస్థిరంగా ఉందని వ్యాఖ్యానించారు. "పైగా, పార్టీ ఎమ్మెల్యేలకు, ఎంపీలకు సీఎం నితీశ్ ఏ మాత్రం సమయం ఇవ్వడం లేదు. వారిని సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారు. భవిష్యత్తుపై వారికి భరోసా ఇవ్వడం లేదు. ఆ అసంతృప్తి కూడా వారిలో ఉంది" అని సుశీల్ మోదీ వివరించారు.నితీశ్ కుమార్ పార్టీ అయిన జేడీయూతో బీజేపీ ఎట్టి పరిస్థితుల్లో పొత్తు పెట్టుకోబోదని బీజేపీ సీనియర్ నేత సుశీల్ కుమార్ మోదీ స్పష్టం చేశారు. దాదాపు 17 ఏళ్ల పాటు నితీశ్ కుమార్ ను మోశామని, ఇకపై ఆ తప్పు చేయబోమని తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని బీజేపీ అగ్రనేత అమిత్ షానే స్వయంగా చెప్పారన్నారు. "చివరకి నితీశ్ స్వయంగా వచ్చి చేతులు కట్టుకుని నిల్చున్నా.. ఆయనతో కలిసే ప్రసక్తే లేదు. అని అమిత షా అన్నారు" అని సుశీల్ వెల్లడించారు.

# చంద్రయాన్ 3 వేళ ఇస్రో ముందు సవాళ్లు

**బెంగళూరు, జులై 6 :**

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) తన చంద్రయాన్-3 మిషన్‌ను జులై 13న ప్రారంభించనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట స్పేస్ సెంటర్ నుంచి ఈ విషన్‌ను ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించనున్నారు. చంద్రయాన్-3 మిషన్‌లోని వ్యోమనౌక 2 నెలల సుదీర్ఘ ప్రయాణం చేసి చంద్రుడిపై ల్యాండ్ అవుతుంది. ఇస్రో ఇంతకు ముందు కూడా చంద్రుడిపై అడుగుపెట్టింది. 2008 అక్టోబర్‌లో చంద్రయాన్-1 మిషన్ ద్వారా భారత్ చంద్రుడిపై మొదటి సారిగా అడుగుపెట్టింది. ఇంకా ఆ మిషన్ ద్వారా చంద్రుడిపై ఒకప్పుడు నీరు ఉన్నట్లుగా ఆనవాళ్లను భారత్ గుర్తించింది. అయితే చంద్రుడిపై దిగడం చాలా సవాళ్లతో కూడుకున్న మిషన్. చంద్రయాన్-2 మిషన్ పేరుతో 2019లో ఇస్రో చేపట్టిన విఫలమైన సంగతి తెలిసిందే. అప్పుడు చంద్రయాన్ ల్యాండర్, రోవర్ రెండూ క్రాష్ అయిన సంగతి తెలిసిందే.నిజానికి చంద్రునిపై లేదా అంతరిక్షంలోని వేరే



గ్రహంపై ల్యాండింగ్ చేయడానికి చాలా విషయాలపై కలిసి పనిచేయాలి. నావిగేషన్, ఫ్లైట్ డైనమిక్స్, లోడింగ్ సైట్ క్లియర్ ఇమేజ్, లోడ్ అయ్యే ముందు సరైన సమయంలో స్పేస్‌క్రాఫ్ట్ తగ్గడం వంటి ఎన్నో విషయాలు మిషన్‌ని ప్రభావితం చేస్తాయి.ఇంకా వ్యోమనౌక ఉపరితలం వైపు కదులుతూ విడిపోయినప్పుడు దానిపై ఉన్న ల్యాండర్ వేగాన్ని తగ్గించడం చాలా అవసరం. వేగాన్ని సెకనుకు మూడు మీటర్లకు తగ్గించకపోతే, లాడింగ్ కూడా విఫలం కావచ్చు.ఇవే కాక చంద్రునిపై వాతావరణం , భూమిపై లాంటి గురుత్వాకర్షణ శక్తి లేని నేపథ్యంలో.. లోడ్ చేసే సమయంలోనే అంతరిక్ష నౌక వేగం, గురుత్వాకర్షణను చాలా బాగా కాల్క్యులేట్ చేసుకోవాలి. పైగా చంద్రునిపై పెద్ద క్రేటర్స్ కూడా ఉన్నందున ల్యాండింగ్ కోసం సరైన ఉపరితలాన్ని గుర్తించడం చాలా చాలా అవసరం. సరైన ల్యాండింగ్ పాయింట్‌ని ఎంచుకోబడకపోతే, అంతరిక్ష నౌక క్రాష్ అయ్యే ప్రమాదం ఉంది.

# కానరాని కారుమబ్బులు.. మొలకెత్తని పత్తి విత్తులు

**అదిలాబాద్, జులై 6 :**

కారు మబ్బు కానరావడం లేదు. కార్తెలు దాటి పోతున్న వరుణుడి కరుణించడం లేదు. తొలకరి చినుకుతో భారీ ఆశల నడుమ పత్తిసాగు చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ రైతు వానలు కురవక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పత్తి విత్తును కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. బిందెలు , డ్రమ్ములతో నీళ్లు పోస్తూ విత్తనం పాడవకుండా కాపాడుకుంటున్నారు. సకాలంలో వానలు కురిసేలా వరుణ దేవుడు దీవించాలని కోరుతూ ఊరురా గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి మొక్కులు చెల్లించు కుంటున్నారు. మేఘాలవైపు ఆశగా చూస్తున్నా వరుణిడి జాడ మాత్రం కానరావడం లేదు.ఇప్పటికే తొలకరి జల్లులతో పచ్చగా కనిపించాల్సిన ఉమ్మడి ఆదిలాబాద్ పల్లెలు వాన చినుకు లేక మోడుబారి దర్శనమిస్తున్నాయి. ఏరువాకతో పండుగ వాతావరణంలో ఉండాల్సిన రైతు చినుకు జాడ కనిపించక ఆందోళన చెందాల్సిన పరిస్థితి. రోహిణి కార్తెకు వానలు షురూ అవ్వాలి. మృగశిరకు భారీ వర్షాలు కురవాలి. ఆరుద్ర కార్తె కూడా దాటిపోయింది. అయినా వాన జాడ మాత్రం కనిపించడం



లేదు. వానకాలం ప్రారంభమై నెల రోజులు దాటినా ఆశించిన మేరా వర్షాలు పడటం లేదు. ఆదిలాబాద్ జిల్లాలోని తాంసి , తలమడుగు , భీంపూర్ , నార్నూర్ , బోథ్ , ఇచ్చోడ మండలాల పరిదిలో లక్షా 75 వేల ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంట ఎండిపోయే ప్రమాదం లో పడింది. విత్తనాలు మొలకెత్తక పోవడంతో తీవ్ర ఆందోళనలో పడి పోయారు పత్తి రైతులు.జూన్ రెండో వారంలో వేసిన పంటలు మొలకెత్తస పోవడంతో జూన్ మూడో వారంలో కురిసిన వర్షాలకు మరోసారి పత్తి విత్తనాలు నాటారు ఆదిలాబాద్ రైతులు. అయితే ఈసారి మూడు రోజులు మురిపించిన వానలు.. వారం రోజులు దాటినా కానరాక పోవడంతో ఆ పంటలను కాపాడుకునేందుకు బిందెలతో నీళ్లు పోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎకరా లోపు అయితే బిందెలతో నీళ్లు పోసి కాపాడుకోగలమని.. ఎకరానికి పైగా ఉన్న పొలాల్లో వేసిన పత్తి పంటపై ఆశలు వదులు కోవాల్సిందే అంటున్నారు ఆదిలాబాద్ పత్తి రైతులు. వ్యవసాయ బావులు ఉన్న వారు ఇప్పటికే తడులు పెడుతున్నా? బావుల్లో కొద్దిపాటి నీరే ఉండడంతో వారిలో కూడా ఆశలు ఆవిరవుతున్నాయి. మరో రెండు రోజుల్లో వర్షాలు కురియకపోతే ఈసారి తీవ్ర నష్టాల భారీన పడే ప్రమాదం లేకపోలేదంటున్నారు పత్తిరైతులు.

## అల్లర్ల కేసుమరో ఆరుగురు అరెస్టు

**సిద్దిపేట**
గజ్వేల్ అల్లర్లలో మరో ఆరుగురిని పోలీసులు గురువారం అరెస్ట్ చేసారు. దీంతో అల్లర్ల కేసులో 17కు అరెస్టుల సంఖ్య చేరింది. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ రెచ్చగొడుతున్నవారిపై పోలీసులు నిఘా పెడుతున్నారు. వదంతులను నమ్మవద్దని, శాంతియుతంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## చీరల వ్యాపారులపై దాష్టీకం

**విజయవాడ**
ధర్మవరం చీరల వ్యాపారులపై బెజవాడ వ్యాపారులు దాష్టీకం ప్రదర్శించారు. చీరలు అమ్మిన బకాయి సొమ్ము అడగటానికి వచ్చిన ఇద్దరు వ్యాపారులను బెజవాడ వ్యాపారులు నిర్బంధించి ఇబ్బందులకు గురిచేశారు. డబ్బు బకాయి విషయంపై వ్యాపారుల మధ్య వివాదం తలెత్తింది. కోపంతో ఊగిపోయిన బెజవాడ వస్త్ర దుకాణ వ్యాపారి విచక్షణ మరచి... ఇద్దరు వ్యాపారుల బట్టలు ఊడదీసి దాడి చేశాడు. అంతటితో ఆగకుండా నగ్నంగా ఉన్న ఇద్దరు వ్యాపారులను వీడియోలు తీశాడు. ఆపై వీడియోలను ధర్మవరంలో వ్యాపారులకు పంపించి వికృతంగా ప్రవర్తించాడు. ప్రస్తుతం ఆ వీడియోలు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. 20 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీడియోల ద్వారా విషయం తెలుసుకున్న బెజవాడ ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు.. బెజవాడ వ్యాపారి ఆగడాలపై ఆరా తీస్తున్నారు.

## వామపక్షాల నిరాహార దీక్ష పోస్టర్ల ఆవిష్కరణ

**విశాఖపట్నం**

మోడీ సర్కార్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నా జగన్ సర్కార్ ప్రశ్నించకపో వడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కా ర్యదర్శి ఎం జగ్గునాయుడు తప్పుపట్టా రు.కేంద్ర ప్రభు త్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందని మండి పడ్డారు. విశాఖ మద్దిలపాలెంలోని సిపిఎం కార్యా లయంలో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై ఈనెల 7, 8 తేదీల్లో సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యద ర్శులు చేపట్ట నున్న నిరాహార దీక్ష పోస్టర్లను ఆ పార్టీ నేతలు ఆవిష్క రించారు.ఈ సంద ర్భంగా జగ్గు నాయు డు మాట్లాడు తూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్లాంటకు సొం త గనులు కేంద్రం కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తి డి తీసుకురావాలన్నా రు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను పరి రక్షించుకోవాలని లక్ష్యంతో 24 గంటల నిరాహార దీక్ష చేపడుతున్నామని చెప్పారు

## ఎమ్మెల్యే సంజయ్ జన్మదిన వేడుకలు

### ఆలయాల్లో అర్చనలు

### పేదలకు వస్త్రాలు,గొడుగులు పంపిణీ

**జగిత్యాల**

జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్,పెన్షనర్ల అసోసియేషన్ల ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాలు,గొడుగులు జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,మాజీ మున్సిపల్ చైర్మన్ జీ.ఆర్.దేశాయ్ ల చేతుల మీదుగా పంపిణీ చేశారు.గణేష్ నగర్ లోని లక్ష్మీ గణేష్,వెంకటేశ్వర మందిరాల్లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేరిట అర్చనలు చేయించారు.ఈ కార్యక్రమాల్లో తెలంగాణ అల్ సీనియర్ సిటీజన్స్ ,పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,సీనియర్ సిటీజన్స్ గౌరవ సలహాదారు మాజీ మున్సిపల్ చైర్మన్ జీ.ఆర్.దేశాయ్,ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,ఉపాధ్యక్షులు బొల్లం విజయ్,ఎండి. యాకూబ్,కోశాధికారి వి.ప్రకాష్,నాయకులు పి.సతీష్ రాజు,పూసాల ఆశోక్ రావు,హన్మాండ్లు,నరేందర్ రెడ్డి, కూసరి అనిల్,పంబాల రాం కుమార్, సమిండ్ల శ్రీనివాస్, బండారి విజయ్,పుప్పాల కిషోర్ కుమార్, లైశెట్టి వెంకట్,కస్తూరి శ్రీమంజరి,బోబ్బాటి కరుణ, సీనియర్ సిటీజన్స్,పెన్షనర్ల,టీబీసీ జేఏసీ, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ ఈవో వాయిదా

**తిరుమల, జులై 06 :**

7వ తేదీ శుక్రవారం జరగాల్సిన దయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని పరిపాలన కారణాల వల్ల వాయిదా వేయడం జరిగింది. తదుపరి తేదీని తిరిగి తెలియజేయడం జరుగుతుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరడమైనది

## 25 మందిని గాయపర్చిన కుక్క

**పల్నాడు**

పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. దాదపు 25 మందిని గాయపర్చింది. అందులో పిల్లలు, పెద్దలు ఉన్నారు. పిడబ్ల్యూడి కాలనీ లోని బాలుర ఉన్నత పాఠశాల దగ్గర నుండి రైలు గేటు మీదుగా, శ్రీనివాస మహల్ సెం టర్, రింగ్ రోడ్డు మీదుగా సదరు కుక్క పరిగెత్తుతూ మను షులపై దాడులు చేసింది. బాధితులందరూ చికిత్స కోసం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. ఈ విషయం తెలుసు కున్న మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, కమిషనర్ ఇవి రమణ బాబులు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి బాధి తులను పరా మర్శించారు. డాక్టర్లును అడిగి ర్యాబిస్ వ్యాక్సిన్ నిల్వలు సరిపడా ఉన్నాయా లేవా అని ఆరా తీశారు. కమి షనర్ మట్లాడుతూ గత వారం రోజుల నుండి పట్టణంలో తిరిగే వీధి కుక్క లను పట్టిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాతపన
prajathapana.com
News that matters



# ఏపీలో మల్లాది కృష్ణారావు పొలిటికల్ ఎంట్రీ

**విశాఖపట్టణం, జూలై 6::**

మల్లాడి కృష్ణారావు.. యానాం అసెంబ్లీ నియోజకవర్గం వేదికగా పాండిచ్చేరి రాష్ట్ర రాజకీయాల్లో మూడు దశాబ్దాలుగా కీలకమైన నేతగా ఉంటున్నారు. మల్లాది కృష్ణారావు ఆంధ్రప్రదేశ్ తో కూడా అదే తరహా రాజకీయ సంబంధాల్ని కలిగి ఉన్న విషయం అందరికి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ దగ్గర 30 చ.కి.మీ. విస్తీర్ణం ఉన్న ఈ కేంద్రపాలిత ప్రాంతం యానాం పేరుకు పుదుచ్చేరి రాష్టం అయినా మాట్లాడేదంతా తెలుగు భాషనే. యానాం వార్తలు మన తూర్పుగోదావరి జిల్లా పేపర్లలోనే వస్తాయి. యానాంకు ఆ రాష్ట్ర రాజధాని పాండిచ్చేరి 870 కి.మీ. దూరంలో తమిళనాడులో ఉంది. యానాం 1954 దాకా భారతదేశంలోని ఫ్రెంచ్ కాలనీగా ఉంది. ప్రస్తుతం పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతంలో భాగం. 1954లో విమోచనం చెంది, స్వతంత్ర భారతావనిలో విలీనం చెందినా 1956 లో భాషా ప్రాతిపదికన తెలుగు రాష్ట్రంలో కలవలేదు. దాంతో అది పాండిచ్చేరి లో అలా ఉండిపోవాల్సి వచ్చింది. గతంలో కాకినాడ మునిసిపల్ కౌన్సిల్ కూడా యానాన్ని గ్రేటర్ కాకినాడలో కలపాలని తీర్మానం చేసింది. 870 కిలోమీటర్ల దూరంలోని రాజధాని తమిళ పుదుచ్చేరికి కంటే యానాం ప్రజల ప్రయాణం కాకినాడ కేంద్రం గానీ జరుగుతుంతుంది. అలాంటి యానాంలో ఉన్నది కేవలం 55 వేలు ఓట్లు అయినా గత 70 ఏళ్లలో దాదాపు 60 యేళ్లు ఇద్దరే ఎమ్మెల్యేలు గా ఉండే వారు. వారిలో మల్లాడి కృష్ణా రావు ఒకరు. 1996 నుంచి 2021 వరకు 25 సంవత్సరాలు ఏకచకాధిపత్యంగా ఐదు సార్లు వరుసగా ఎమ్మెల్యే గా, 2006 నుంచి పర్యాటక, స్థానిక పరిపాలన, పౌర విమానయానం, గ్రామీణాభివృద్ధి, జిల్లా, గ్రామీణాభివృద్ధి శాఖలను, 2008 లో రెండవసారి రెవెన్యూ, ఎక్సైజ్, ఫిషరీస్, పర్యాటకం, పౌర విమానయాన మంత్రిగా చేశారు. 2016-2021 కాలంలో పుదుచ్చేరి వైద్యశాఖ మంత్రిగా పనిచేసారు.రాజకీయాల్లోకి రాకముందు సామాజిక కార్యకర్తగా విశేషమైన నేపథ్యం మల్లాడికి ఉంది. యానాం సమస్యల పరిష్కారం కోసం అంటూ 1994



లో యానాం నుంచి పాండిచ్చేరి కి 870 కిలోమీటర్ల దూరాన్ని వందలాది మంది కార్యకర్తల తో ఐదు రోజుల్లో నడిచి వెళ్ళి సంచలనం సృష్టించిన నేతగా పేరుంది. అలాగే ఓల్డ్ ఏజ్ హోం, బ్లడ్, ఐ బ్యాంక్ ల ఏర్పాటు, పేదలకు తన సొంత స్థలం లో పలు కాలనీ లు నిర్మించిన నేతగా కూడా చెబుతుంటారు. అలాంటి నేత ఆ రాష్ట్ర హోం మంత్రిగా ఉంటూనే 2021 లో తాను యానాం నుంచి పోటీ చేయనంటూ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించి సంచలనం సృష్టించాడు. 2020 లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం భారీ ఎత్తున 56 బీ సీ కార్పొరేషన్ లను ఏర్పాటు చేసి ఘనంగా నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అతిథిగా హాజరైన మల్లాడి.. అదే వేదికపై యానాం నుంచి ఇక పోటీ చేయనని ప్రకటించడం అప్పట్లో సంచలనం అయింది. ఈ విషయం ఇంకా మా పాండిచ్చేరి రాష్ట్ర సీఎం కు చెప్పలేదు మీ ముఖ్యమంత్రి సమక్షంలో చెప్తున్నాను అంటూ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద చర్చకే దారి తీశాయి. అనంతరం అక్కడ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామిని నిలబెట్టి మద్దతు ఇచ్చారు కానీ అక్కడ ఇండిపెండెంట్ అభ్యర్థిగా నిలబడ్డ గొల్లపల్లి అశోక్ శ్రీనివాస్ గెలవడం, ఆ తర్వాతా పాండిచ్చేరి రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి గా యానాం లో ఆయన రాజకీయ ప్రయాణం సాగిస్తూనే ఉన్నారు.అదే సమయంలో యానాం లో మంత్రిగా ఉన్నా అప్పటి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తో సన్నిహితుడిగా ముద్రపడ్డ మల్లాడి కృష్ణా రావు ఆయన తర్వాతా జగన్ తోనూ సన్నిహిత, రాజకీయ సంబంధాలను సాగిస్తూ వస్తున్నారు. ముఖ్యంగా ఈస్ట్ గోదావరి జిల్లా ముమ్మిడివరం తో పాటు పలు మత్స్యకార ఓటర్లు ఎక్కువగా ఉండే నియోజకవర్గాలలో ఆయన అప్పట్లో వైఎస్ కు అనుకూలంగా, ప్రస్తుతం వైసీపీ కు అనుకూలంగా ప్రచారం కూడా చేస్తూ ఉంటారని ప్రచారం ఉంది. బీసీ ? అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఆంధ్ర ప్రదేశ్ బీసీ ఐక్యతా సంస్థలకు గౌరవ అధ్యక్షులుగా ఉంటూ 2019 ఎన్నికలకు ముందు బీసీ సంఘాలను వైసీపీ కు అనుకూలంగా మలిచేందుకు కూడా ప్రయత్నించారని చెబుతుంటారు. అనంతరం ఆయనకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం టీటీడీ పాలక మండలి సభ్యులు గా కూడా అవకాశం ఇచ్చింది. ప్రస్తుతం ఆయన ఆ పదవిలో కూడా కొనసాగుతున్నారు.అలాంటి కృష్ణా రావు ఇటీవల విశాఖ లోని ఒక ప్రైవేట్ హోటల్ లో బీసీ సంఘాలతో సమావేశం నిర్వహించారు. బీసీలు అందరూ ఐక్యంగా ఉండాలంటూ బిసీల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారట. అందులో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ లోని అన్ని జిల్లా కేంద్రాలలో ఈ సమావేశాల ఏర్పాటుకు సిద్ధమయ్యారట. అలాగే రాష్ట్రంలో పలువురు బీసీ నాయకులను కలిసే పనిలో ఉన్నారట. ప్రభుత్వం పట్ల బీసీ ల వైఖరిని తెలుసుకోవడం, వాటిని సరిదిద్దేలా ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు చేస్తున్నారట. ఈ అసైన్మెంట్ ప్రభుత్వ పెద్దలు ఇచ్చారో లేదంటే వైఎస్ కుటుంబం తో ఉన్న సాన్నిహిత్యం వల్ల తానే చేస్తున్నాడో, లేక నిజంగా బీసీల ఐక్యతా రాగమా అన్నది అర్దం కావడం లేదన్నది ఒక వాదన. అయితే ఆయన పుదుచ్చేరి రాజకీయాలకంటే ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల పై ఇటీవల మక్కువ చూపుతున్నారనీ, యానాం నుంచి ఇక పోటీ చేయనని ప్రకటించిన నేపథ్యంలో అదే సమయంలో ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లోకి రావాలని అనుకున్నారా? అందుకే బీసీ సంఘాల ఐక్యత పేరుతో అన్ని ప్రాంతాలలో సమావేశాలు నిర్వహించాలని మొదట విశాఖలో నిర్వహించారా? 2024 ఎన్నికల్లో కీలకంగా భావిస్తున్న బీసీ ఓట్ల ఐక్యత పై దృష్టి ఉన్న నేపథ్యంలో ఏపీ ప్రభుత్వ పెద్దలే కృష్ణా రావును రంగంలోకి దించారన్న చర్చ ప్రస్తుతం ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# గంజాయి మూలాలకు సంబంధించిన ముఠా అరెస్టు

**అనకాపల్లి**

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా ఉక్కు పాదం మోపెందుకు చీడికాడ,కే .కోటపాడు మండల ప్రాంతాలకు సంబంధించి కోణం, తాటిపర్తి ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసామని స్పెషల్ టీమ్లు ద్వారా నిరంతరం నిఘా ఉంటుందని అనకాపల్లి డిఎస్పి సుబ్బరాజు వెల్లడించారు.అనకాపల్లి డిఎస్పీ కార్యాలయంలోబుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్పి సుబ్బరాజు మాట్లాడుతూ.. కే కోటపాడు ప్రాంతంలో గత కొద్ది రోజుల క్రితం బైక్ పై ఇద్దరు వ్యక్తులు బ్యాగులో అక్రమ గంజాయి తరలిస్తుండగాకే.కోటపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ తాతారావు పరిరక్షణలో ఎస్సై ధనుంజయ్ రావు, క్రైమ్ టీం తో కలిసి వారిద్దరిని అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి 1.9 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అదుపులో తీసుకున్న బిట్రా రామోజీ గణేష్, రెడ్డి వినయ్ రెడ్డి ని విచారించి వీరికి గంజాయి సరఫరా చేసిన మధ్యవర్తి గుంటూరు, మంగళగిరి కి చెందిన దొడ్డిపట్ల చెన్నకేశవ ని వారికి గంజాయి సరఫరా చేస్తున్న.. కిల్లో గాశీరాం ను అదుపులోకి తీసుకొని నలుగురిని కోర్టుకు హాజరు పరచడం జరిగిందని డిఎస్పీ తెలిపారు.గంజాయి కేసులో ముద్దాయిలుగా పై నాలుగైదు కేసులు ఉంటే వారి పై పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలుతో నిరంతరం నిఘా పెడుతున్నామని అన్నారు.

# సాహితీ ఘటన మృతులకు అధిక పరిహారం చెల్లించాలి

**విశాఖపట్నం**

ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,000కి పైగా ఫార్మా కంపెనీలు ఉన్నాయని, అక్కడ వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా యని టీడీపీ నేత బుద్దా వెంకన్న అన్నారు.ఇటీవల సాహితీ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో మృతుల కుటుం బాలకు 25 లక్షల చొప్పున మాత్రమే పరిహారం ఇచ్చారని బుద్దా వెంకన్న తెలిపారు. అంతకు ముందు ఎల్జీ పాలిమర్స్ లో మృతుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం చెల్లించా రని అన్నారు. ఆ సంస్థను కాజేయడానికి కూడా వైసీపీ నేత విజయ సాయిరెడ్డి ప్రయత్నించారని ఆరోపించారు. సాహితీ ఘటనలో మృతులకు కూడా అధిక పరిహారం చెల్లించాలని బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు.అధికారులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించ కుండా వైసీపీ నాయకులు అడ్డుకుంటు న్నారని చెప్పారు. ఇటీవల సాహితీ ఫార్మా ఘటనలో మృతుల కుటుంబా లకు అందాల్సిన కోటి రూపాయల నష్ట పరిహారంలో 75 లక్షల రూపాయల చొప్పున అక్కడి మంత్రి, ఇతరులు కలిసి కాజేసి 25 లక్షలు రూపాయలు మాత్రమే ప్రకటించారని ఆరోపించారు.

# నిత్యవసర వస్తువుల ధరలు నియంత్రణలో
# కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



**బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి**

**మెట్ పల్లి**

నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైందని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు,న్యాయవాది పుప్పాల లింబాద్రి ఆన్నారు. గురువారం మెట్ పల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో జిల్లా అధ్యక్షుడు న్యాయవాది పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలు పెరగటం వల్ల పేద మధ్య తరగతి ప్రజల పై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని లింబాద్రి ఆవేదన వ్యక్తం చేశారు.. నిత్యవసర వస్తువుల ధరల విషయంలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చౌక ధర దుకాణాలలో కూరగాయలు, పప్పులు, ఉప్పులు, నూనెలు తక్కువ ధరలకు ప్రజలకు అందజేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. లేని పక్షణ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాలను హెచ్చరించారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ ,డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు బత్తుల లక్ష్మణ్, గురువంతుల ప్రభాకర్ ,గజ్జల్లి రాందాస్ ,సామర్ల కళ్యాణ్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

# మందకొడిగా ఖరీఫ్

**కడప, జూలై 6:**

జిల్లా వ్యవసాయ శాఖ 1.90 లక్షల ఎకరాల్లో సాగు ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లాలోని 36 మండలాల పరిధిలో 5,770 ఎకరాల్లోనే విత్తనం పడింది. 1.84 లక్షల ఎకరాల్లో విత్తనం పడాల్సి ఉంది. గతేడాది ఇదేసమయానికి సుమారు తొమ్మిది వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. గతేడాది సాగుతో పోలిస్తే 50 శాతం కూడా సాగుకు నోచుకోకపోవడం గమనార్హం. త్వరలో కడప-కర్నూలు కాల్వకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో 92 వేల ఎకరాల్లో వరి సాగు ఊపందుకునే అవకాశం ఉందనే అంచనాలో వ్యవసాయశాఖ నిమగమైంది. జిల్లా వ్యాప్తంగా వరి, ఇతర పంటల సాగు ఊపందుకునే అవకాశాలు ఉన్నాయనే అంచనా వేసుకుంటోంది.జిల్లాలో జూన్‌లో 68.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి నైరుతి తిరోగమనం కారణంగా 35.9 మి.మీ మాత్రమే వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగించింది. సీజన్ ఆరంభంలో మంచి వర్షపాతం నమోదైతే విత్తనం వేయడానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. ఫలితంగా ఖరీఫ్ సీజన్ ఊపందు కునే అవకాశం ఉంటుంది. నమోదు స్థాయికి సగం మాత్రమే వర్షపాతం నమోదు కావడంతో వ్యవసాయ బోర్ల కింద మాత్రమే పంటల సాగు నడుస్తోంది. మెట్టప్రాంతాల్లో విత్తనం విత్తడానికి అవకాశం లేకుండా పోయింది.జులైలో 96.7 మి.మీ, ఆగస్టులో 118.4. మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. జులైలో 9.35 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావడంతో రైతాంగం సాగుకు సన్నద్ధమైంది. ప్రస్తుతం




అల్పపీడన వాతావరణం కొనసాగుతున్న నేపథ్యంలో కురుస్తున్న అడపాదడపా వర్షాలకు రైతాంగం ఆశాభావంతో ముందుకు కదులుతోంది. జులైలో నైరుతి ఏమే రకు సహకరిస్తుందనే అంశంపై ఖరీఫ్ సాగు ఆధారపడి ఉందని చెప్పవచ్చు.ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా పత్తి సాగవుతోంది. 2,398 ఎకరాల్లో విత్తనం పడింది. 2,092 ఎకరాల్లో మినుములు, 4,487 ఎకరాల్లో వేరుశనగ విత్తనం పడింది. జిల్లాలోని ప్రధాన ఆహార పంటల్లో మినుములు 837 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా, 2092 ఎకరాల్లో విత్తనం పడడం గమనార్హం.53,268 ఎకరాల్లో పత్తి సాగు కావాల్సి ఉండగా 2,398 ఎకరాల్లోనే పడినట్లు తెలుస్తోంది. ఇతర పంటల సాగుదలను పరిశీలిస్తే మొక్కజొన్న 1407 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 61 ఎకరాల్లో సాగుకు నోచుకుంది. పప్పుదినుల సాగులో కందులు 8528 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 18 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం. ఆయిల్ సీడ్స్ వివరాలను పరిశీలిస్తే పొద్దుతిరుగుడు 2889 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 89 ఎకరాల్లో సాగు కావడం ఆందోళన కలిగిస్తోంది. సోయా బీన్ 2119 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 2.5 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడడం వర్షాభావ తీవ్రతను తెలుపుతోంది. మిరప 3,198 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 195 ఎకరాల్లోనే విత్తనం పడడం ఆందోళన కలిగిస్తోంది. ఉల్లి, ధనియాల పంటల సాగు ఆనవాలే కనిపించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. మరో వాణిజ్య పంట పసుపు 7,518 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా ఒక్క ఎక రమూ సాగుకు నోచుకోకపోవడం గమనార్హం. జిల్లాలోని ప్రధాన ఆహారపు పంట వరి 82,041 ఎకరాలకు గానూ 261 ఎకరాల్లోనే సాగు కావడం గమనార్హం.

# శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు యువత ఆదర్శం

**కోరుట్ల**

జన సంఘ్ వ్యవస్థాపకులు , భారత తొలి పరిశ్రమక శాఖ మంత్రి, హిందూ మహాసభ పూర్వ అధ్యక్షుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు బుధవారంపట్టణంలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఆనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్, పట్టణ అధ్యక్షులు దాసరి రాజశేఖర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జాతీయ భావజాలంతో జాతీయ సమైక్యత కోసం




ఎంతగానో కృషి చేశారని, 370 ఆర్టికల్ రద్దు కోసం ఆయన ఎంతో గాను తపన చెందారని పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పుడే అప్పటి ప్రధాని నేహ్రా జాతి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తన మంత్రి పదవి త్యజించి, జన సంఘ్ ని స్థాపించారని గుర్తు చేశారు..

# బాబు జగ్జీవన్ రామ్ కు కోమటిరెడ్డి నివాళులు

**నల్లగొండ**

నల్లగొండ లో డాక్టర్. బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా అయన విగ్రహానికి భువనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నివాళులు అర్పించారు.
ఎంపి మాట్లడుతూమాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ కేవలం దళితుల కోసమే కాదు అన్ని వర్గాల వారి అభ్యున్నతి గురించి ఆలోచించిన మహనీయుడు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. దేశంలో వ్యవసాయ రంగం ఇంత పురోగతి సాధించిందంటే అది జగ్జీవన్ రామ్ ముందుచూపు వల్లే. ఆ మహనీయుడి వర్ధంతి సందర్భంగా నల్గొండలోని ఆయన విగ్రహానికి నివాళు లు అర్పించాం. నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ విగ్రహం ఏర్పాటైంది. ఇది నా అదృష్టంగా భావిస్తున్నా. ఆనాడు లోక్ సభ స్పీకర్ గా ఉన్న ఆయన కుమార్తె మీరా కుమార్ గారిని తీసుకొచ్చి జగ్జీవన్ రామ్, డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ ఇద్దరి మహనీయుల విగ్రహాలు పక్కపక్కనే ఎక్కడా లేవు. మన నల్గొండలోనే



ఏర్పాటు చేశాం. జగ్జీవన్ రామ్ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వాలు, నాయకులు నడవాలని అన్నారు..

# విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షులుగా అరుణ్

**జగిత్యాల**

విశ్వహిందూ పరిషత్ జగిత్యాల పట్టణ అధ్యక్షులుగా జిట్టవేని అరుణ్ కుమార్ ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన గురువారం జరిగినవిశ్వహిందూ పరిషత్ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పద్మాకర్ నూతన నియామకాలకు చేపట్టారు.ఈ సందర్భంగా వి.హెచ్.పి జగిత్యాల పట్టణ అధ్యక్షులుగా జిట్టవేని అరుణ్ కుమార్, నగర కార్యదర్శిగా గణపతి నరేందర్ రాజు లను నియమించారు. తమ నియామకాలకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మామిడాల రాములు, నగర ఉపాధ్యక్షులు ముస్కరి ప్రశాంత్ గాజోజు సంతోష్ తోపాటు పలువురు ఉన్నారు.

# కొత్తగా మరో 8 మెడికల్ కాలేజీలు

**హైదరాబాద్, జూలై 6:**

రాష్ట్రంలో కొత్తగా 8 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇప్పటికే తెలంగాణలో 26 వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభిస్తుండగా.. తాజాగా మరో 8 మెడికల్ కాలేజీలకు అనుమతి ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 34కు చేరబోతోంది. తాజా ఆదేశాలతో రాష్ట్రంలో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 10 వేలకు చేరింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే నాటికి రాష్ట్రంలో కేవలం 5 మెడికల్ కాలేజీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 9 ఏళ్లలో జిల్లాకో వైద్య కళాశాల దిశగా సర్కారు అడుగులు వేసింది. జోగులాంబ గద్వాల్, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఈ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు కానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆయా వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ నుంచి అనుమతులు జారీ అయితే వచ్చే విద్యా సంవత్సరానికి జిల్లాకో మెడికల్ కాలేజీ



కల సాకారం అవుతుందని ప్రభుత్వం తెలిపింది. అయితే ఇప్పుడు సర్కారు అనుమతించిన 8 కాలేజీల్లో ఒక్కో దానిలో 100 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున మొత్తం 800 మెడికల్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య పది వేలకు చేరువ కానుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి గాంధీ, ఉస్మానియా, కాకతీయ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్ రిమ్స్, నిజామాబాద్ మెడికల్ కాలేజీలు మాత్రమే అందుబాటులో ఉండేవి. 2016వ సంవత్సరంలో మహబూబ్ నగర్, సిద్దిపేట జిల్లాల్లో కళాశాలలు ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. 2018-19 సంవత్సరంలో నల్గొండ, సూర్యాపేట జిల్లాలోనూ ప్రభుత్వ వైద్య కళాశాలలను అందుబాటులోకి తెచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మరో 8 మెడికల్ కాలేజీలు ప్రారంభించాలని తీసుకున్న నిర్ణయంపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాకో మెడికల్ కాలేజీ కల సాకారం కానున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య తెలంగాణ విజన్‌కు అనుగుణంగా ఈ కళాశాలలు విద్యార్థులకు వైద్య విద్యను అభ్యసించడానికి మరిన్ని అవకాశాలను పెంపొందిస్తాయని ట్వీట్ లో పేర్కొన్నారు.కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు 100 సీట్లతో మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని విద్యా శాఖ మంత్రి సబితా రెడ్డి కొనియాడారు. మహేశ్వరం నియోజకవర్గంలో మెడికల్ కళాశాల మంజూరు చేసిన ముఖ్యమంత్రికి ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణపై కాంగ్రెస్ హై కమాండ్ దృష్టి

**హైదరాబాద్, జూలై 6:**

వచ్చే అసెంబ్లీ ఎన్నికలు చావో రేవో అన్నట్టుగా భావిస్తోంది తెలంగాణ కాంగ్రెస్. ఈసారి రాష్ట్రంలో ఉనికి చాటుకోకుంటే? ఇక దుకాణం కట్టేసుకోవాల్సిందేనన్నంత కసి, భయం కలగలిసి ఉన్నాయట ఆ పార్టీ నేతల్లో. రాష్ట్ర నాయకుల సంగతి పక్కన పెడితే? అధిష్టానమే ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నట్టు తెలిసింది. అంతర్గత కుమ్ములాటలతో ఎట్టి పరిస్థితుల్లో ప్రత్యర్థులకు ఛాన్స్ ఇవ్వకూడదన్న పట్టుదలగా వ్యూహ రచన జరుగుతోందట. పార్టీకి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, ఇలాంటి అవకాశాన్ని చేజార్చుకోకూడదనుకుంటూ? నౌ ఆర్ నెవర్ అంటున్నారట పార్టీ పెద్దలు. అందుకనే? సోనియా, రాహుల్, ప్రియాంక.. ఇలా అంతా ఇప్పుడు తెలంగాణ మీద ఫోకస్ పెట్టారట. మరీ ముఖ్యంగా పొలిటికల్ వీఆర్ఎస్ తీసుకున్న సోనియా కూడా ఈ విషయంలో చాలా పర్టిక్యులర్‌గా ఉన్నట్టు తెలిసింది. ఖమ్మం బహిరంగ సభ జరిగిన రోజున ఆమె వ్యవహారశైలి గురించి తర్వాత తెలుసుకున్న టి కాంగ్రెస్ నేతలు అవాక్కయ్యారట.ఖమ్మం సభ జరుగుతున్న తీరును సోనియా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ? స్వయంగా పర్యవేక్షించారట. సభ మీద పోలీసుల ఆంక్షలు, వచ్చేవారిపై నియంత్రణ గురించి తెలుసుకున్న సోనియాగాంధీ?. నాలుగైదు సార్లు రాహుల్ సెక్యూరిటీ అధికారుకి ఫోన్ చేసి ఆరా తీశారట. సభ దగ్గర ఎవరెవరు ఉన్నారు..? ఏం జరుగుతోంది? జన సమీకరణ లాంటి అంశాలపై ఆమె వాకబు చేసినట్టు తెలుసుకున్న కొంత మంది సీనియర్ నేతలు అవాక్కయ్యారట. మేడమే నేరుగా ఫోకస్ పెట్టడం ఏంటి? ఆ స్థాయిలో పర్యవేక్షిస్తున్నారంటే?.అధిష్టానం ఎంత సీరియస్ గా తెలంగాణ మీద ఫోకస్ పెట్టిందో అర్థం అవుతోందంటున్నారు. అటు చేరికలపై కూడా నేరుగా అధిష్టానమే దృష్టిసారిస్తోంది. పార్టీ చేయించుకుంటున్న సర్వేల ఆధారంగానే చేరికల లెక్కలు ఉన్నట్టు తెలిసింది. ఎత్తుగడలకు సంబంధించిన ఆదేశాలన్నీ?.ఢిల్లీ నుంచే వస్తున్నాయని అంటున్నారు. అంటే? ఎట్నుంచి ఎటు చూసినా? ఏ అవకాశాన్ని మిస్ అవకుండా జాగ్రత్తలు తీసుకుని ప్లాన్ చేయాలన్న దిశగా అడుగులు వేస్తోంది కాంగ్రెస్ అధిష్టానం. ఖమ్మంలాంటి సభల్ని వీలైనంత ఎక్కువగా పెట్టాలన్న ఆలోచన కూడా మొదలైందట. అలాగే ఎన్నికలలోపు రాహుల్ బహిరంగ సభలు ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒకటి పెడితే ఎలా ఉంటుందన్న ఆలోచన కూడా పార్టీ హైకమాండ్‌కు ఉన్నట్టు తెలిసింది.ఖమ్మం సభపై రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. సభ ముగిశాక విజయవాడ వెళ్తూ?. దారిలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి థాక్రే తో తెలంగాణపై చర్చించారట రాహుల్. ఖమ్మం లాంటి సభలు జిల్లాకు ఒకటి నిర్వహించేలా ప్లాన్ చేయాలని సూచించారట. పాలమూరు జిల్లా సభను కూడా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని చెప్పినట్టు తెలిసింది. జూపల్లి చేరిక సభకు ప్రియాంక వస్తున్నందున ఖమ్మం తరహాలో సభను నిర్వహించాలని అధిష్టానం నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. పాలమూరు సభ తేదీ ఖరారవకున్నా? ఈనెల 20న నిర్వహించవచ్చని ప్రాథమిక సమాచారం. మహబూబ్‌నగర్ జిల్లా సభ అయ్యాక పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ మీటింగ్ పెట్టే అవకాశం ఉంది. మొత్తంగా వరుస సభలు..సమావేశాలతో టి కాంగ్రెస్‌లో జోష్ నింపే పనిలో పడింది పార్టీ అధిష్టానం. ఆ ప్రణాళికలు ఏ మేరకు వర్కౌట్ అవుతాయో, రాష్ట్ర నాయకులు ఎంత వరకు సఖ్యతగా కలిసి పనిచేస్తారో చూడాలి.

# మళ్లీ రేసులోకి రావడం అంత ఈజీ కాదు

**హైదరాబాద్, జూలై 6 :**

తెలంగాణ భారతీయ జనతా పార్టీతో ఆ పార్టీ హైకమాండ్ ఎన్నికలకు ముందు ఆ ఆట ఆడుకుంది. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడ్ని మార్చడం ద్వారా మొత్తం సిస్టమ్ కదిలిపోయేలా చేసింది. ఇప్పుడు తెలంగాణ బీజేపీలో ఒక్కరు కూడా ఎన్నికల గురించి ఆలోచించడం లేదు. పార్టీలో ఎవరు ఉంటారు.. ఎవరు వెళ్లిపోతారు.. ఎవరికి ఎలాంటి పదవులు దక్కుతాయన్న చర్చలే జరుపుతున్నారు. అసలు బీజేపీ ఇలాంటి నిర్ణయాలు ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందనే దానిపై విశ్లేషణలు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడి మళ్లీ బీజేపీ రేసులోకి రావాలంటే చాలా సవాళ్లనే ఎదుర్కోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా బీజేపీలో జరిగిన అనూహ్య మార్పులతో ఎక్కువగా జరుగుతున్న ప్రచారం బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అవగాహన కుదిరిందన్నదే. ఇది ఆ రెండు పార్టీలనూ ఇబ్బంది పెట్టే అంశమే. కారణాలు ఏవైనా ఇతర పార్టీలు చేస్తున్న విమర్శలు కాకుండా.. కొన్ని పరిణామాల వల్ల ప్రజలు కూడా దీన్ని గట్టిగా నమ్ముతున్నారు. అందుకే.. బీజేపీ ఇప్పుడు ఎదుర్కోవాల్సిన మొదటి సవాల్.. బీఆర్ఎస్‌తో ఎలాంటి లోపాయికారీ ఒప్పందం లేదని ప్రజలను నమ్మించగలగడం. మాటలతో చెబితే ప్రజలు నమ్మలేరు. చేతల్లో చూపించాలి. అవి ఎలాంటి చేతలనేది రాజకీయాల్లో పండిపోయిన బీజేపీ నేతలే నిర్ణయించుకోవాల్సి ఉంది. ఈ విషయం లో ఫెయిలయితే.. తెలంగాణలో బీఆర్ఎస్ బీ టీంగా ఉండిపోవాల్సి వస్తుంది. బండి సంజయ్ నాయకత్వాన్ని కొంత మంది వ్యతిరేకించారనేది నిజం. కానీ బీజేపీ హైకమాండ్ ఆ వ్యతిరేకత కారణంగా బండి సంజయ్ ను మారుస్తారని ఎవరూ అనుకోలేదు. దీనికి బలమైన కారణం ఉంది. బండి సంజయ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత బీజేపీ అనూహ్యంగా పుంజుకుంది. గ్రామ స్థాయికి పార్టీని తీసుకెళ్లే ప్రయత్నాలు చేశారు. పాదయాత్ర ద్వారా పార్టీకి ఊపు తెచ్చారు. అందుకే బండి సంజయ్ ను వ్యతిరేకించే వారిని సంతృప్తి పరిచేందుకు పదవులు ఇస్తారని ఇంకా మంకు పట్టు బడితే.. వేరే దారి చూసుకోమని చెబుతారని అనుకున్నారు. కానీ బండి సంజయ్ ను మార్చడం వల్ల.. ఇప్పుడు ఆయనపై సానుభూతి పెరుగుతోంది. ఆయనకు మద్దతుగా కొత్త నాయకత్వానికి వ్యతిరేకంగా మాట్లాడేవారి సంఖ్య పెరుగుతోంది. ఇప్పుడు అందర్నీ ఏకతాటిపైకి తీసుకు రావడం బీజేపీ ముందున్న అతి పెద్ద సవాల్ . ఇప్పటి వరకూ బీజేపీలో వారు చేరుతారు.. వీరు చేరుతారని చెప్పుకున్నారు. బండి సంజయ్ ఏకపక్ష పోకడల వల్లే చేరడం లేదని సాకులు చెప్పుకున్నారు. కానీ ఇప్పుడు మొత్తం పరిష్కారం అయిపోయాయి. నాయకత్వం మారిపోయింది. ఇప్పుడు బీజేపీ ముఖ్య నేతలు చేయాల్సింది బీజేపీలో చేరికల్ని పెంచుకోవడం. ముఖ్యంగా అధికార పార్టీ నుంచి ఎక్కువగా నేతల్ని ఆకర్షిస్తే.. మళ్లీ ట్రాక్ లోకి రావడానికి అవకాశం ఉంది. ఏం జరిగినా తెలంగాణ బీజేపీకి పెద్దగా సమయం లేదు. నిర్ణయాలన్నీ వేగంగా తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఎన్నికలు ముంచుకొస్తున్నాయి మరి !

# చెట్టుకు పుట్టిన రోజు వేడుక చేసిన మంత్రి వేముల

**గ్రామస్థులతో కలిసి కేక్ కట్ చేసిన మంత్రి**

**కేసిఆర్ వల్ల రాష్ట్రంలో పచ్చదనం పెరిగింది**

**హరితహారం గొప్ప కార్యక్రమం**

**చెట్లను సంరక్షించుకోవడం మనందరి బాధ్యత**

**- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**

**వేల్పూర్**

సరిగ్గా 8 సంవత్సరాల క్రితం (6-7-2015) వ తేదీన మొదటి విడత హరిత హారం లో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వేల్పూర్ మండల కేంద్రంలోని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఇంటి ఆవరణలో నాటిన మొక్క నేడు 8 సంవత్సరాలు పూర్తి చేసుకొని 9 వ సంవత్సరం లోకి అడుగిడిన సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రజలు,బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి చెట్టుకు పుట్టిన రోజు వేడుకలు జరిపారు.



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ చేపట్టిన హరిత హారం కార్యక్రమం చాలా గొప్ప నిర్ణయం అని అన్నారు. ఇది ఓట్ల కోసం చేసేది కాదని భావి తరాల భవిష్యత్తు కోసం చేపట్టిన కార్యక్రమం అని వెల్లడించారు. ప్రపంచం మొత్తం అడవుల శాతం తగ్గిపోతుంటే మన తెలంగాణ లో మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ గారి చర్యల వల్ల 7.7 శాతం అడవులు పెరిగాయి అని తెలిపారు. మొక్కలు సంరక్షించడం నాటడం మన అందరి బాధ్యత అని మంత్రి గుర్తు చేశారు.. మొక్కలు నాటడం వలన సకాలంలో వర్షాలు కురుస్తాయని మంత్రి పేర్కొన్నారు..

# బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**కోరుట్ల**

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, దివంగత భారత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య-అనిల్ అన్నారు.. గురువారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా చైర్ పర్సన్ అన్నం లావణ్య,తోపాటు దళిత సంఘం నేతలు, ప్రముఖులు, కౌన్సిలర్లు పట్టణంలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా భారత ఉప ప్రధానమంత్రిగా దేశ ప్రజలకు ఎనలేని సేవలు అందించిన గొప్ప నాయకుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆహర్నిషలు కృషి చేశారన్నారు .నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు.ఆనంతరం తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, బాబు జగ్జీవన్ రామ్ మెమోరియల్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడుపేట భాస్కర్ మాట్లాడుతూ దేశంలో బడుగు బలహీన వర్గాలు, శ్రమజీవులు, కార్మికుల పక్షన అనేక సంస్కరణలకు అద్యుడుగా నిలిచిన బాబు జగ్జీవన్ రామ్ కు గౌరవంగా పట్టణంలో తన పేరిట పాలక పక్షం ఏర్పాటు చేస్తున్న జగ్జీవన్రామ్ పార్క్ పనులను వచ్చే జయంతోత్సవాలకైన సిద్ధం చేయాలని మున్సిపల్ పాలక పక్షాన్ని కోరారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండి అయాజ్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అన్నం అనీల్, పద్మశాలి కులొన్నతి సంఘం జిల్లా అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీ నారాయణ, బలిజ పద్మ- రాజరెడ్డి, ఎండి సాబీర్,మాడవేణి నరేష్, సజ్జు, పెర్ల సత్యం, అడేపు మధు, అంబేద్కర్ సంఘాల



నాయకులు చిట్యాల కరుణాకర్, చిట్యాల లచ్చయ్య,చెట్పల్లి లక్ష్మణ్, బలవంతుల సురేష్, బెక్కెం అశోక్, తెడ్డు రాజం,ఉయ్యాల నర్సయ్య, శోభన్ బాబు, బంగారు ప్రమేద్, మగ్గిడి వెంకట్,కృష్ణంరాజు,దశరథం,ప్రశాంత్,అల్లం రాజమౌళి,జర్నలిస్ట్ నేతలు నవాబ్ ఆలీ,ముఖ్రమ్ బేగ్,బానాల శ్రీధర్,పండిత్ శంకర్, మున్సిపల్ మేనేజర్ చిట్యాల శ్రీనివాస్, సానిటర్ ఇన్స్పెక్టర్ గజానంద్, రమేష్ తోపాటు వివిధ పార్టీల నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటీజన్స్ ఆధ్వర్యంలో ఆర్డీవో వినోద్ కుమార్ కు సన్మానం

**కోరుట్ల**

మెట్ పల్లి ఆర్డీవో వినోద్ కుమార్ ఇటీవల ఆర్మూర్ కు బదిలీ అయిన సందర్భంగా తెలంగాణ అల్ సీనియర్ సిటీజన్స్ అస్సోసియేషన్ కోరుట్ల డివిజన్ శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు..అనంతరం సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ రూపొందించిన వయోధికుల సంక్షేమ,రక్షణ చట్టం అవగాహన ప్రచార పోస్టర్ల ను,పిలుపు పుస్తకాలను ఆర్డీవో వినోద్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని అన్నారు.కోరుట్ల డివిజన్లో సీనియర్ సిటీజేన్స్ కేసుల్లో రాజీ అధికారులుగా ,అస్సోసియేషన్ ప్రతినిధులుగా పనిచేస్తున్న పబ్బా శివానందం,రాజ్ మోహన్,లక్ష్మీ నారాయణ,రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడుగా సేవలను అందిస్తున్న హరి ఆశోక్ కుమార్ లను అభినందించారు.కోరుట్ల డివిజన్ సీనియర్ సిటీజన్స్ అధ్యక్షుడు పబ్బా శివానందం మాట్లాడుతూ కోరుట్ల,మెట్ పల్లి డివిజన్ల లో ఆర్డీవో వినోద్ కుమార్ వృద్ధుల కేసుల్లో సత్వర పరిష్కారం చూపడంతో



పాటు,డివిజన్ లో మొట్ట మొదటి ఆర్డీవో గా ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల డివిజన్ సీనియర్ సిటీజన్స్ అధ్యక్షుడు పబ్బాశివానందం,కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్,కోశాధికారి నల్ల లక్ష్మినారాయణ,ఉపాధ్యక్షుడు ఎండి. సైఫోద్దిన్,సయ్యద్ సాబీత్ అలీ,ల్యాండ్ అక్విజిషన్ అధికారి పి.హన్మంత్ రెడ్డి,మెట్ పల్లి డివిజన్ సీనియర్ సిటీజన్స్ అధ్యక్షుడు ఒజ్జెల బుచ్చిరెడ్డి,కార్యదర్శి సౌడాల కమలాకర్, సీనియర్ సిటీజన్స్,పెన్షనర్ల,ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# ద్యార్థులు విద్యతోపాటు సంస్కారం కూడా ప్రతి ఒక్కరికి అవసరం

**బద్వేలు**

విద్యార్థులు చిన్న వయసు నుండే విద్య తో పాటు సంస్కారం, వ్యక్తిగత పరిశుభ్రత, కూడా ఎంతో ముఖ్యమని ఎంవిఐ శేఖర్ రావు వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్ గౌరీ సాయి బార్ అండ్ రెస్టారెంట్ అధినేత బ్రహ్మదేవుని యద్రం రెడ్డి పబ్బతి సత్యనారాయణ సచివాలయ సెక్రెటరీ చిరంజీవి, సాఫ్ట్వేర్ ఇంజనీర్ పబ్బతి సుదిప్తి అన్నారు, గురువారం మున్సిపాలిటీ పరిధి సిద్ధవటం రోడ్ ఎరుకల కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బసవరాజు పాల అరుణకుమారి ఎన్ జయమ్మ ఓ సంగీత సుధారాణిల ఆధ్వర్యంలో విద్యార్థులకు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శేఖర్ రావు తో పాటు పలువురి చేతుల మీదుగా విద్యాసామాగ్రిని అందజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎం.వి శేఖర్ రావు పాఠశాల హెచ్ఎం



ఉపాధ్యాయురాలు శాలువాతో సత్కరించి అభినందించారు, విద్యార్థులు చిన్న వయసునుండే కష్టపడి చదువుకొని మంచి ఉజ్వల భవిష్యత్తుకు చేరుకోవాలని అప్పుడే చదువు చెప్పిన గురువులకు తల్లి దండ్రులకు మంచి గుర్తింపు తెచ్చుకున్న వారు అవుతారని అనంతరం విద్యార్థులకు పలు రకాల సలహాలు సూచించారు, ప్రతి సంవత్సరం తిరుమల ట్రస్ట్ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యాసామాగ్రి అందజేయడం అభినందనీయమని వారు పలువురిని అభినందించారు

# ఎస్సారెస్పీ వరద కాలువ కు చేరుకున్న కాళేశ్వరం జలాలు

**నిజామాబాద్**



బాల్కొండ నియోజకవర్గం కమ్మర్పల్లి మండలం ఉప్లూర్ వద్ద కాళేశ్వరం జలాలకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పూజలు చేసారు. ఈ కార్యక్రమానికి రైతులు భారీగా తరలి వచ్చారు.

మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతుల కల నెర వెరిన రోజు ఇది. ఎప్పటికైనా..తెలంగాణ రైతులతో పాటు దేశ రైతాంగానికి కేసీఆరే శ్రీరామ రక్ష. కలలో కూడా ఊహించలేదు గోదారమ్మ ఎదురు ఎక్కుతదని. సీఎం కేసీఆర్ కి రైతుల పక్షాన ధన్యవాదాలు. నా హయం లో ఎస్సారెస్పీ పునర్జీవం పనులు పూర్తి అవటం నా అదృష్టం గా భావిస్తున్న. 2001 లో ఇచ్చిన మాట నిల బెట్టుకొని రైతుల గుండెల్లో చిరస్మనియ స్థానం సంపాదించారు సీఎం కేసీఆర్.. 300 కిలో మీటర్ లు రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని తరలించడం చాలా గొప్ప విషయం.. ఇక వర్షాలతో సంబంధం లేకుండా సంవత్సరం పొడువునా రైతులకు సాగు నీరు అందుతుందని అన్నారు. కాళేశ్వరం తో కేసీఆర్ కు మంచి పేరు వస్తుందనే ప్రతి పక్షాలు బురద జల్లే పరయత్నం చేస్తున్నాయి. 90 వేల కోట్ల తో పనులు జరిగితే లక్ష కోట్ల అవినీతి జరిగింది అనటం హాస్యాస్పదం. ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేస్తే అంతకు రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తాం. కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు మహారాష్ట్ర ,కర్ణాటక ,తమిళ నాడు తో పాటు యావత్ దేశ రైతులు కొనియాడుతున్నారు. రైతులు... ప్రతి పక్షాల అరోపలను తిప్పి కొట్టాలని పిలుపునిస్తున్నానని అన్నారు.

# దేవనకొండలో ప్రభుత్వ డిఎన్టి హాస్టల్ ను పునరుద్దించండి

**కర్నూలు**



జిల్లా విజిలెన్సు మానిటరింగ్ కమిటీలో ( డివిఎంసి) మెంబెర్ గా మరియు టెలిఫోన్ అడ్వైసరీ కమిటీలో( టి ఏ సి ) మెంబెర్ మరియు వైస్సార్సీపీ పార్టీ యూత్ లీడర్ కాకర్ల శాంతికుమార్ కర్నూలు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి ని కలసి డిఎన్టి సంక్షేమ హాస్టల్ గురించి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కాకర్ల శాంతికుమార్ మాట్లాడుతూ నా సొంత మండలం దేవనకొండ మండలము. మా మండలములో పేద విద్యార్థులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మరియు మైనార్టీ కులాలకు చెందినవారికి సరైన విద్య దొరకటం లేదు, ఇక్కడ మా పిల్లలు చదువుకోవటానికి వేరే ఊర్లకు వెళ్ళవలసి వస్తుంది, మండలములో మీరు హాస్టల్ ను పునరుద్దరించాలని కోరుకుంటున్నాము. కరోనా కారణంగా నిలిపివేసిన డిఎన్టి సంక్షేమ హాస్టల్ ను ప్రారంభించండి. దేవనకొండ మండలంలో 42 సంవత్సరాల కాలంగా హాస్టల్ కు సొంత భవనము లేక అద్దె భవనం లో అరకొర వసతులతో కొనసాగుతోంది చాలా కాలంగా హాస్టల్ వార్డెన్ సమస్య కూడా ఉన్నది, కరోనా కారణంగా నిలిపివేశారు, తిరిగి ప్రారంభించలేదు దేవనకొండ లో నిరుపయోగంగా ఉన్న కొన్ని ప్రభుత్వ భవనాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాము.

# మంత్రి అంబటి ప్రధాన అనుచరుడు బత్తుల ఆదినారాయణ టీడీపీలో చేరిక

**పల్నాడు జూలై 6**



టీడీపీలో చేరికలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. అటు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రను నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఇక నేడు మంత్రి అంబటి రాంబాబు ప్రధాన అనుచరుడు ఆయనకు షాక్ ఇచ్చి టీడీపీలో జాయిన్ అయ్యారు. కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో వైసీపీ నేత బత్తుల ఆదినారాయణ టీడీపీలో చేరారు. సత్తెనపల్లి వైసీపీ లీగల్ సెల్‌కు బత్తుల ఆదినారాయణ అధ్యక్షుడిగా ఉన్నారు. మంత్రి అంబటి రాంబాబుకు ప్రధాన అనుచరుడు కావడం గమనార్హం. అలాగే ఏపీ కాపునాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కూడా ఆదినారాయణ పని చేశారు.

ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. "ప్రముఖ న్యాయవాది, సత్తెనపల్లి వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షులు శ్రీ ఆదినారాయణ గారు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదినారాయణ గారిని చంద్రబాబు గారి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించాము. రాక్షస పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించడానికి.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలతో పాటు మేధావులు, న్యాయవాదులు కలిసి కట్టుగా కృషి చేయాలి" అన్నారు.

# మాజీ జవాన్ ఆత్మహత్య..

## ఐదు ఎకరాల భూమి రానందున.. మానసిక వేదనతో...??

**నందికొట్కూర్**

నంద్యాలజిల్లా నందికొట్కూరు నియోజకవర్గం లోని నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి చెందిన మాజీ జవాన్ ఆత్మహత్య చేసుకోవడం గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.. కొణిదెల గ్రామంలో రెడ్డి కొండారెడ్డి. బాలకృష్ణారెడ్డి అన్న తమ్ముళ్ళు. గ్రామంలో సూది రెడ్డి కుటుంబ సభ్యులు అంటే మంచితనానికి మారుపేరు... ఈరోజు ఆ కుటుంబ సభ్యుడు చనిపోవడంతో కొణిదెల గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది.. నవీన్ రెడ్డి మాజీ సైనికుడు గత ఆరు సంవత్సరాల క్రితం రిటైర్మెంట్ కావడం జరిగింది.. పేరుగాంచిన కుటుంబం ఆర్థిక స్తోమత లేక ఒక ప్రైవేటు బ్యాంకులో పని చేసుకుంటూ నవీన్ రెడ్డి. భార్య మంజులారెడ్డి. కూతుళ్లు హాశ్విత.తిరుషీ. చదువులు ఇంటి బాధ్యతలు మోపిడు కావడంతో మానసిక ఆవేదనతో మద్దన పడుతుండేవాడు అని కుటుంబ సభ్యులు తెలియజేశారు. పదవి మానుకున్న సుమారు ఆరు సంవత్సరాలైనా కూడా మాజీ సైనికులకు ఇచ్చే ఐదు ఎకరాల భూమి రాకపోవడంతో ఆవేదనతో ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని భార్య మంజులారెడ్డి తెలియజేశారు.. మహబూబ్నగర్ జిల్లా కొత్తకోట మండలం మహేశ్వరి లాడ్జిలో మాజీ సైనికుడు. నవీన్ రెడ్డి(43) ఉరి వేసుకోగా లాడ్జింగ్ నిర్వాహకులు వెళ్లి చూసేసరికి ప్రాణం విడిచారని. మాజీ జవాన్. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామ నివాసి ఆర్థిక సమస్యలతో సూసైడ్ చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటన స్థలానికి ఎస్ఐ మంజునాథ్ రెడ్డి వెళ్లి పరిశీలించారు. ఆయన గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నందికొట్కూరు మండలం మాజీ సైనిక సంక్షేమ సంఘనీ ప్రెసిడెంట్ బి.అగస్టీన్, సెక్రెటరీ ఎస్.నరసింహులు, ట్రెజరర్ ఎం.నాగరాజు మాజీ జవాన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అలాగే మాజీ జవాన్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వము సహాయ సహకారాలు అందించాలని మాజీ సైనికులకు ఇచ్చే ఐదు ఎకరాల భూమి తక్షణమే భార్యా పిల్లలకు ఇప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొణిదల గ్రామ ప్రజలు కుటుంబ సభ్యులు. అభిమానులు కోరుకుంటున్నారు.

# 12వ తేదీలోగా బండి మంత్రి పదవి తేలే అవకాశం

**హైదరాబాద్ జూలై 6**



బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను కేంద్ర మంత్రి పదవి వరించేది, లేనిది తేలడానికి మరో వారం పట్టే అవకాశం ఉన్నది. రాష్ట్రపతి ద్రౌపది ముర్మ దేశ రాజధానిలో లేకపోవడం, ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటనకు తెలంగాణకు రానున్న నేపథ్యం కారణంగా మంత్రి వర్గ పునర్ వ్యవస్థీకరణ ఆలస్యం కానున్నది. మరో ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా బీజేపీ జాతీయ నాయకత్వం రాష్ట్రంలో నాయకత్వ మార్పునకు పూనుకున్నది. ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ కుమార్‌ను మార్చి ఆయన స్థానంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అధ్యక్షుడిగా నియమించింది.రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన సంజయ్ సేవలను వినియోగించుకోవడానికి కేంద్ర నాయకత్వం ఆయనకు కేంద్ర మంత్రి వర్గంలో చోటు కల్పించడమో లేక జాతీయ కార్యదర్శిగా నియమించి కొన్ని రాష్ట్రాలకు బాధ్యులుగా పంపించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. ఒకే వ్యక్తికి ఒకే పదవి అన్న కారణంతో కేంద్ర మంత్రి పదవికి కిషన్‌రెడ్డి రాజీనామా చేయాల్సి ఉన్నది. ఆయన రాజీనామాతో కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణకు ప్రాతినిధ్యం లేకుండా పోతుంది. ఆయన స్థానంలో రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన బండి సంజయ్ కుమార్‌కు అవకాశం కల్పిస్తారని ప్రచారం జరుగుతున్నది. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారని తెలుస్తున్నది. గత మంత్రి వర్గ కూర్పు సమయంలోనే ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా గిరిజనులకు ప్రాధాన్యం కల్పించినట్లవుతుందని, ఆయా వర్గాల్లో పార్టీని మరింత బలంగా తీసుకు వెళ్లేందుకు వీలు కలుగుతుందని భావించారు. అప్పటి సమీకరణాల కారణంగా అది వీలు కాకపోవడంతో ఇప్పుడు ఆయన పేరు బలంగా వినవస్తున్నది.రాష్ట్ర అధ్యక్షుడిగా రాజీనామా చేసిన సంజయ్ తాను సామాన్య కార్యకర్తగానే ఉంటానని ప్రకటించడం పార్టీ నాయకత్వంపై కినుకతోనేనని భావిస్తున్నారు. ఆయనలో అసంతృప్తిని తొలగించి గతంలో మాదిరిగానే చురుకుగా వ్యవహరించేందుకు మంత్రి పదవి కట్టబెట్టే అవకాశం ఉన్నదని చెబుతున్నారు. రాష్ట్రానికి రెండు మంత్రి పదవులు ఇచ్చే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. పార్టీలో జాతీయ కార్యదర్శి హోదాకు మంచి ప్రాధాన్యం ఉన్నా సొంత రాష్ట్రంలో క్రియాశీలంగా వ్యవహరించే అవకాశం లేనందువల్ల సంజయ్ ఆ పదవి పట్ల సుముఖంగా లేరని అందుకే కేంద్ర నాయకత్వం మంత్రి పదవిని కట్టబెట్టే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు.ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ జిల్లాలో పర్యటించి బహిరంగ సభలో పాల్గొననున్నారు. 9న హైదరాబాద్‌లో జరిగే దక్షిణాది రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, మంత్రులు, ఇతర ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పార్టీ వ్యవస్థాగత అంశాలపై, తెలంగాణలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై చర్చిస్తారని సమాచారం. ఆయన 9న రాత్రి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఆ సమయానికి రాష్ట్రాల పర్యటనలు ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ కూడా ఢిల్లీ చేరుకుంటారు. ప్రధాని తిరిగి ఈ నెల 13న విదేశీ పర్యటనకు వెళ్లనున్నందున 10 నుంచి 12వ తేదీలోగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని భావిస్తున్నారు. ఈ మంత్రివర్గ కూర్పులోనే సంజయ్ భవితవ్యం తేలుతుంది.సంజయ్‌కి మంత్రి పదవి లభిస్తే ఒకే విడతలో మూడు ఉన్నత స్థాయి పదవులు అలంకరించిన వ్యక్తిగా మారనున్నారు. 2019లో కరీంనగర్ ఎంపీగా గెలుపొందిన ఆయన కొంత కాలానికే రాష్ట్ర అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు కేంద్ర మంత్రి పదవి కూడా దక్కితే ఐదేళ్ల వ్యవధిలో మూడు క్రియాశీల పదవులను నిర్వహించిన వ్యక్తిగా గుర్తింపు పొందుతారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఢిల్లీ నుంచి బయల్దేరి బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. గురు, శుక్రవారాల్లో వరంగల్‌లో మకాం వేసి ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.

# బాబు జగజ్జీవన్ రామ్ కు ఘనంగా నివాళులు

**విజయవాడ**

బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా 50 వ డివిజన్ ఖాదర్ సెంటర్ వద్ద బాబు జగజ్జివనరామ్ విగ్రహానికి మాదిగ సంక్షేమ సంఘ అధ్యక్షులు పైడి ముక్కల చక్రవర్తి అద్వర్యనీలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా దాడి జగన్ మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాతల్లో ఒకరు బాబూ జగ్జీవన్‌రామ్ ఒకరిని,అహింసా తత్వాన్ని పుణికి పుచ్చుకున్నారని, జాతీయోద్యమంలో గాంధీ స్ఫూర్తితో పాల్గొని, దేశ రాజ కీయాల్లో ఒక సరికొత్త నినాదంగా మారిన వ్యక్తినీ,బ్రిటిషర్స్ 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని తీసుకువస్తున్న సందర్భంలోనే 'ఆల్ ఇండియా అణగారిన వర్గాల సమాఖ్య'ను ఏర్పాటు చేసి దళిత బహుజన వర్గాలను జాతీయ స్థాయిలో ఐక్యపరచే కార్యాచరణకై ఉద్యమించారాని,దేశ రక్షణ శాఖ మంత్రిగా ఆయన కార్యసాధన ఎప్పటికీ ఆదర్శనీయమనీ,దేశ ప్రజల చేత 'బాబూజీ' అన్న పిలుపు పొందిన గౌరవం ఇద్దరు వ్యక్తులకు మాత్రమే దక్కిందనీ ఒకరు మహాత్మాగాంధీ కాగా, మరొకరు బాబూ జగ్జీవన్ అని, నేటి రాజకీయ నాయకులు ఆయన్ని ఆదర్శంగా తీసుకుని పరిపాలన కొనసాగించాలని దాడి జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు బత్తుల పాండు,విజయవాడ వైఎస్సార్సీపీ బిసి విభాగం ప్రధాన కార్యదర్శి పైడాడ శ్రీనివాసరావు బఇ నాయకులు ఏనుగుల రమేశ్, మహిళా నాయకురాలు పైడిముక్కల సరళ ఎండీ మస్తాన్,కూచిపూడి రవి కుమార్, సందిపాముల శ్రీను తదితరులు పాల్గొనీ నివాళులర్పించారు

# నడ్డాతో పురందరేశ్వరి భేటీ

**న్యూఢిల్లీ, జూలై 6 :**



ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలిగా నియమితులైన దగ్గుబాటి పురందేశ్వరి .. తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఢిల్లీలో సమావేశం అయ్యారు. పార్టీ అధ్యక్షురాలిగా నియమించిన సమయంలో ఆమె అమరనాథ్ యాత్రలో ఉన్నారు. యాత్ర ముగించుకుని ఢిల్లీకి వచ్చిన తర్వాత జేపీ నడ్డాతో సమావేశం అయ్యారు. ఏపీలో బీజేపీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తామని పురందేశ్వరి తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం , ఏపీ ప్రజల ప్రయోజనాల కోసమూ కృషి చేస్తామన్నారు. దగ్గుబాటి పురందేశ్వరి ఇప్పటి వరకూ రాష్ట్ర రాజకీయాల్లో పెద్దగా జోక్యం చేసుకోలేదు. కాంగ్రెస్ పార్టీ హయాంలో పదేళ్లు కేంద్ర మంత్రిగా చేశారు. ఆ తర్వాత బీజేపీలో చేరిన జాతీయ స్థాయి పదవుల్లోనే పని చేశారు. అయితే ఆమెను తొలి సారిగా రాష్ట్ర బీజేపీ అద్యక్ష పదవిలో నియమించారు. దేశంలో బీజేపీ అత్యంత బలహీనంగా ఉన్నది ఏపీలోనే. ఒక్క శాతం ఓటు బ్యాంక్ కూడా లేదు. గత తొమ్మిదేళ్ల నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ..బలహీనంగా ఉన్న ఇతర రాష్ట్రాల్లో బలోపేతం అయినప్పటికీ ఏపీలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. ఎంత మంది నేతల్ని మార్చినా పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. దీంతో బీజేపీ హైకమాండ్ పురందేశ్వరి వైపు మొగ్గు చూపింది. ఇక ముందు పెద్ద ఎత్తున కార్యక్రమాలు పేట్టాలనే ఆలోచనలో బీజేపీ ఉంది. పురందేశ్వరి ఒకటి, రెండు రోజుల్లో ఏపీకి రానున్నారు. ఈ సందర్భంగా భారీ కార్యక్రమాలు చేపట్టాలనే ఆలోచన చేస్తున్నారు. గతంలో బీజేపీ అమరావతికి మద్దతు ఇచ్చినా అక్కడి రైతులు నమ్మలేకపోయారు. అలాగే పలు అంశాలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడినా .. ప్రజలు బీజేపీ, వైసీపీ ఒక్కటే అన్న అభిప్రాయం వ్యక్తం చేసేవారు. కానీ ఇప్పుడు మాత్రం పురందేశ్వరి నాయకత్వంలో అలాంటి ముద్ర వేయడానికి అవకాశం ఉండదని భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు, ప్రజా చార్జి,షీట్ వంటి కార్యక్రమాలు నిర్వహించింది. అయితే ప్రో వైసీపీ ముద్ర ఉండటంతో పెద్దగా ప్రజల్లోకి వెళ్లలేదు. ఇప్పుడు పురందేశ్వరి నాయకత్వంలో మరింత జోరుగా ప్రజల్లోకి వెళ్లే ఆలోచన చేయాలనుకుంటున్నారు. దీనిపై కార్యాచరణ త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు.

# టమాటాలెత్తికెళ్ళిన గజదొంగలు

**మహబూబాబాద్**

డొర్నకల్ ల్ మున్సిపల్ కేంద్రంలోని కూరగాయల మార్కెట్ లో విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. ధర ఎక్కువ గల కురగాయలను దుండగులు దొంగిలించారు. మార్కెట్ లోని లక్ పతి అనే దుఖాన దారుడి షాప్ లో ఉన్నటువనీటి దర ఎక్కువ గల టమాట, పచ్చి మిర్చి,చిక్కుడు కాయలతో పాటు మరికొన్ని కురగాయలను ట్రాలీ లో ఎత్తుకెళ్లారు. కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్న తరుణంలో ధర ఎక్కువ కూరగాయలను దొంగిలించడం మార్కెట్ లో ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మహబూబా బాద్ జిల్లాలో గత కొంతకాలంగా జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతు న్నారు. ఈసారి దొంగలు ఎలాంటి బంగారం, నగదు ,వాహనాల లాంటివి కాకుండా టమాటాలను ఎత్తుకెళ్లినట్లుగా కూరగాయల వ్యాపారులు ఆరోపిస్తున్నారు. కాగా ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది .సాధారణంగా దొంగలు విలువైన వస్తువులు చోరిచేస్తుండటం సర్వసాధారణం.. కానీ డోర్నకల్ లో అధిక ధర పలుకుతున్న టమాటా, పచ్చిమిర్చి, చామగడ్డలపై దొంగల కళ్లు పడ్డాయి. డోర్నకల్ కూరగాయల మార్కెట్లోని పలు దుకాణాల్లో ఇటీవల కూరగాయలు చోరీకి గురవుతున్నాయి. గాంధీ సెంటర్లోని కూరగాయల మార్కెట్లో రాత్రి వేళల్లో దుకాణాలకు తాత్కాలిక నెట్ ఏర్పాటు చేస్తారు. మార్కెటు నైట్ వాచ్ మెన్ లేకపోవడం,సీసీ కెమెరాలు లేకపోవడం తో ఇటీవల కూరగాయల ధరలు కొండెక్కి టమాటా 150 రూ.లు పలుకుతుండగా రాత్రి వేళల్లో పలు దుకాణాల్లోని కూరగాయలు చోరీకి గురవుతున్నట్లు వ్యాపారులు గుర్తించారు. బుధవారం ఉదయం కూరగాయల వ్యాపారి లక్పతి తన దుకాణం తెరిచి చూడగా అధిక ధర పలుకుతున్న టమాటా, పచ్చిమిర్చి, చామగడ్డతోపాటు ఇతర కూరగాయలు చోరీ అయినట్టు గుర్తించి లబోదిబోమన్నాడు.

# జూలై చివరి వారంలో రెజీనా “నేనేనా” రిలీజ్

2012లో రిలీజైన ఎస్ఎంఎస్ (శివ మనసులో శృతి) సినిమాతో తెలుగు సినీ రంగంలో అడుగు పెట్టింది రెజీనా కసాండ్రా . తన అందం, అభినయంతో అతి తక్కువ కాలంలోనే వరుస అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఫ్యాన్ బేస్ ను పెంచుకుంది. ముఖ్యంగా రొటీన్ లవ్ స్టోరీ, కొత్తజంట, పిల్లా నువ్వు లేని జీవితం, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ వంటి చిత్రాలతో మంచి పేరును సాధించుకుంది.రెజీనా ప్రస్తుతం ఆపిల్ ట్రీ స్టూడియోస్ ప్రొడక్షన్ లో “సూర్పనగై” అనే సినిమాను చేస్తుంది. కార్తీక్ రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అక్షర గౌడ , అలీ ఖాన్ , జై ప్రకాష్ వంటి కీలక నటులు నటిస్తున్నారు. శ్యామ్ సి ఎస్ సంగీతం అందిస్తున్నారు.

అన్ని పనులను పూర్తి చేసుకున్న ఈ చిత్రం. ఈ నెల చివరివారంలో రిలీజ్ కి సిద్ధమవుతోంది. జాంబిరెడ్డి సినిమాతో మంచి హిట్ అందుకున్న ఆపిల్ ట్రీ స్టూడియోస్ ప్రొడక్షన్ పై ఈ చిత్రం తెరకెక్కింది.



# ‘భోళా శంకర్’- డబ్బింగ్ పూర్తి చేసిన మెగాస్టార్ చిరంజీవి



మెగాస్టార్ చిరంజీవి, స్టైలిష్ మేకర్ మెహర్ రమేష్ దర్శకత్వంలో చేస్తున్న మెగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ భోళా శంకర్’ టీజర్‌లో తన వింటేజ్ స్టైలిష్ మాస్ అవతార్ లో కనిపించి అందరినీ అలరించారు మెగాస్టార్. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా మెగా స్టార్ చిరంజీవి ‘భోళా శంకర్’ డబ్బింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా డబ్బింగ్ స్టూడియో నుంచి ఫోటోలు అభిమానులతో పంచుకున్నారు.


”సినిమా రూపుదిద్దుకున్న తీరు చాలా ఆనందంగా ఉంది. ఈ ఫైర్ మాస్ ఎంటర్‌టైనర్ ఖచ్చితంగా ప్రేక్షకులందరినీ ఆకట్టుకుంటుంది! మీ క్యాలెండర్ లను మార్క్ చేసుకోండి! థియేటర్స్ లో కలుద్దాం! ౘ భోళాశంకర్ ఆగస్టు 11” అని ట్వీట్ చేశారు మెగాస్టార్.

ఇటీవలే విడుదలైన ఈ చిత్రం టీజర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. సినిమాలోని ఫస్ట్ సింగిల్ ఇప్పటికే చార్ట్‌బస్టర్ గా నిలిచింది. మిగిలిన పాటలు ఒకదాని తర్వాత ఒకటి విడుదలౌతాయి. మహతి స్వర సాగర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.ఈ మెగా మాసివ్ యాక్షన్ ఎంటర్ టైనర్ రామబ్రహ్మం సుంకర అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్నారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.డడ్లీ డీవోపీ గా పని చేస్తున్నారు. సత్యానంద్ కథ పర్యవేక్షణ చేయగా తిరుపతి మామిడాల డైలాగ్స్ అందిస్తున్నారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్ గా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ నిర్మాత.భోళా శంకర్ ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. తారాగణం: చిరంజీవి, తమన్నా, కీర్తి సురేష్, సుశాంత్, రఘు బాబు, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, సురేఖా వాణి, శ్రీ ముఖి, హైపర్ ఆది, వైవా హర్ష, ప్రదీప్, అనీ, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, వేణు టిల్లు, తాగుబోతు రమేష్, రష్మీ గౌతమ్, ఉత్తేజ్, వీర్, షావర్ అలీ ఒ తరుణ్ అరోరా










Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950